నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
బుధవారం | సెప్టెంబర్ 06, 2023 | www.navatelangana.com

వరదలో చిక్కుకొని రెండు పశువులు మృత్యువాత



మృత్యువాత పడ్డ పశువులు

నవతెలంగాణ-లింగంపేట్

రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో నీటి ప్రవాహంలో రెండు పశువులు కొట్టుకుపోయి మృతి చెందాయి. లింగంపేట్ మండలంలోని నల్ల మడుగు పెద్ద తండా చెందిన సరి చందు నాయక్ ఎద్దు సోమవారం భారీ వర్షాలు కురవడంతో నీళ్ల ఉధృతంగా ప్రవహించడంతో నీటిలో కొట్టుకుపోయింది. మంగళవారం ఎద్దు ఆచూకీ కోసం వెతకగా పంట చేనులో మృత్యువాత పడి ఉంది. బోనాల్ తండాకు చెందిన బానోత్ బలరాం గేద పెద్దవాగు వరదల్లో చిక్కుకొని పెద్దవాగు సమీపంలో చనిపోయిందని బాధితులు తెలిపారు. 60 వేల విలువ చేసే ఎద్దు మృతి చెందడంతో నష్టం వాటిల్లిందన్నారు. గేదె విలువ 50 వేల వరకు ఉంటుందన్నారు.

అర్హులందరికీ డబుల్ ఇండ్లు : ఎమ్మెల్యే షకీల్

నవతెలంగాణ-బోధన్

బోధన్ నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేసి ఆదుకుంటున్నామని బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని తన నివాసంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్దిదారులకు ఆయన చెక్కులు మంజూరు చేసి మాట్లాడారు. బోధన్ నియోజకవర్గంలో 2000 డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించినట్టు వివరించారు. వాటికి సంబంధించిన బిల్లులను అందించినట్టు తెలిపారు. బోధన్ అర్బన్‌లో 3.56 కోట్ల రూపాయల బిల్లులు, బోధన్ రూరల్‌లో ఇండ్లు నిర్మించుకున్న లబ్దిదారులకు రూ.3.30కోట్ల రూపాయల బిల్లులు అందించినట్టు వివరించారు. ప్రభుత్వం నిరుపేదల సంక్షేమానికి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టినందున మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తీసుకురావాలని కోరారు. ప్రతి కుటుంబంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. విపక్ష పార్టీల మాటలకు మోసపోవద్దని అన్నారు. జడ్పీ వైస్ చైర్మన్ రజిత యాదవ్, డీసీసీబీ డైరెక్టర్ గంగారెడ్డి, శరత్, ముఖ్య నాయకులు బుద్దె రాజేశ్వర్, సాలూర మండల పార్టీ అధ్యక్షులు నర్సయ్య, నవీపేట్ నాయకులు నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జీవితాన్ని ఇచ్చేది గురువే

- అందుకే సమాజంలో గురువులకు ప్రత్యేక స్థానం
- ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకల్లో స్పీకర్ పోచారం

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)/నిజామాబాద్‌సిటీ





కామారెడ్డిలో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి.. ప్రశంసాపత్రాలు, పురస్కారాలు అందుకున్న ఉత్తమ ఉపాధ్యాయులు

జన్మనిచ్చేది తల్లి, నడకనేర్పేది తండ్రి అయితే జీవితాన్ని ఇచ్చి నడిపేది గురువని రాష్ట్ర శాసన సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మంళవారం విద్యా శాఖ ఆధ్వర్యంలో స్థానిక కళాభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో జ్యోతిని వెలిగించి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులకు గురుపూజోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ గురువు లేని విద్య గుడ్డిదని, స్థానం ఏదైనా అందరికీ మార్గదర్శకులు గురువులని అన్నారు. సమాజానికి ఉపయోగపడే విధంగా విద్యార్థులను తయారు చేసేది ఉపాధ్యాయులని, అందుకే గురువుకు సమాజంలో అత్యుత్తమ స్థానం కలిగిందని అన్నారు. విద్యార్థి జీవితాన్ని మలుపు తిప్పేది ఉపాధ్యాయులేనని, మేము కూడా ఒకనాడు విద్యార్థులమే అని, తమకు విద్య నేర్పిన గురువుల వలనే జ్ఞానం, విలువలు అబ్బినవని అన్నారు. ఈరోజు మన దేశం చంద్రయాన్‌లో విజయవంతం కావడంలో పనిచేసిన సైంటిస్టులకు చిన్నానాడు విద్యబుద్దులు నేర్పింది కూడా ఉపాధ్యాయులేనని, మెరుగైన సమాజం ఉండాలంటే నాణ్యమైన విద్య ఉండాలని అన్నారు.



జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించి ప్రజాప్రతినిధులు, అధికారులు

జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ , ఎమ్మెల్యే హన్మంత్ షిండే మాట్లాడారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను శాలువా, ప్రశంసా పత్రంతో సభాపతి, కలెక్టర్, శాసనసభ్యులు సన్మానించారు. అంత కుముందు చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆహుతుల ను అలరించాయి. కార్యక్రమంలో డీఈఓ రాజు, ప్రభుత్వ పరీక్షల సహాయ కమీషనర్ లింగం, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విలువైన విద్య, విజ్ఞానం అందించి సమసమాజ స్థాపనకు దోహదపడాలి : మంత్రి వేమల

ఉపాధ్యాయ వృత్తికి మించిన వృత్తి సమాజంలో మరేదీ లేదని, విద్యార్థులకు నాణ్యమైన విద్య, విజ్ఞానాన్ని అందించి సమసమాజ స్థాపనకు దోహదపడాలని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైనందున అంకిత భావంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తూ గురువు స్థానానికి ఉన్న గౌరవాన్ని మరింతగా ఇనుమడింపజేయాలని హితవు పలికారు. సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం సాయంత్రం జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో గురు పూజోత్సవ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్మన్ ఆకుల లలిత, జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, డీఈవో దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్సారెస్పీ, నిజాంసాగర్ నుంచి వరద పరవళ్లు

ఎస్సారెస్పీకి భారీ వరద

- 16 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల
- నిజాంసాగర్ ప్రాజెక్టు ఐదు గేట్ల నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

నవతెలంగాణ-ముప్కాల్/నిజాంసాగర్

ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో ప్రాజెక్టు 16 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. అదే విధంగా నిజాంసాగర్‌కు ఇన్‌ఫ్లో కొనసాగుతుండటంతో 5 గేట్లు ఎతి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.

ఎస్సారెస్పీకి ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరద నీరు వచ్చి చేరుతుంది. మంగళవారం ఉదయం 7 గంటల సమయంలో 1.14 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండటంతో 26 గేట్లు ఎత్తి నీటిని దిగువన గోదావరికి విడుదల చేశారు. క్రమంగా ఇన్‌ఫ్లో తగ్గుతూ రావడంతో కొన్ని గేట్లు మూసివేశారు. సాయంత్రం 6 గంటల సమయంలో ఇన్‌ఫ్లో 64 వేల క్యూసెక్కులు కొనసాగుతుండగా.. 16 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1091 అడుగులు(90.1 టీఎంసీలు) కాగా ప్రస్తుతం అదే స్థాయి నీరు నిల్వ ఉంది.

నిజాంసాగర్ ప్రాజెక్టులకు ఎగువ ప్రాంతాల నుంచి 35 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతండగా.. ఐదు గేట్లు ఎత్తి అదే స్థాయిలో నీటిని కిందకు విడుదల చేస్తున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1405.00 అడుగులు కాగా ప్రస్తుతం 1404.52 అడుగుల మేర నీరు నిల్వ ఉన్నట్టు ప్రాజెక్ట్ ఏఈ శివ తెలిపారు.

ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనాల కోసం 11న చలో హైదరాబాద్

- జయప్రదం చేయండి : సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్



వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, ఆశాలు

నవతెలంగాణ-నిజామాబాద్(మెండోరా)

ఆశాలకు ఫిక్స్ వేతనం చెల్లించాలని, పనిభారం తగ్గించి పనికి తగ్గ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. ఇతరాత్ర సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 11న తలపెట్టిన చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మంగళవారం మెండోరా, పోచంపాడ్ పీహెచ్‌సీల ఎదుట ధర్నాలు చేపట్టి మెడికల్ ఆఫీసర్‌లకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నూర్జహాన్ మాట్లాడుతూ ఆశ వర్కర్లకు 18 వేలు పిక్స్‌డ్ వేతనంగా నిర్ణయించి చెల్లించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో ఆశ వర్కర్లు గిరిజన ప్రాంతంలో గత 32 సంవత్సరాలు, మైదాన ప్రాంతంలో గత 18 సంవత్సరాల నుండి పనిచేస్తున్నారని, ప్రారంభం నుండి ఇప్పటివరకు ప్రభుత్వం నిర్వహించిన అనేక ట్రైనింగ్‌లు పొంది రిజిస్టర్‌లు రాయడం, ఆన్‌లైన్ చేయడంతో పాటు పలు రోగాలకు నిర్ధారణ టెస్టులు సైతం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం సప్లై చేస్తున్న మందులను ప్రజలకు అందజేస్తున్నారని తగిన జాగ్రత్తలు ఎప్పటికప్పుడు ప్రజలకు వివరిస్తున్నారని తెలిపారు. గతంతో పోలిస్తే ఈ మధ్యకాలంలో ఆశ వర్కర్లకు పని భారం విపరీతంగా పెరిగిందని, పారితోషకంతో పాటు పారితోషకాలు లేని అనేక పనులు ప్రభుత్వం ఆశలతో చేయిస్తున్నట్టు తెలిపారు. ఇంత పని చేస్తున్నా ఆశలకు కేవలం 9750 పారితోషకాలు మాత్రమే ఇస్తున్నారు. వీటితో ఆశ వర్కర్ల కుటుంబాలు పోషణ ఏ విధంగా సాగుతుందని, మరొకవైపు నిత్యవసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని తెలిపారు. కాబట్టి కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని, ఆశాలకు పని భారాన్ని తగ్గించి జాబ్ చార్ట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తదితర డిమాండ్‌ల పరిష్కారం కోసం ఈ నెల 11న చలో హైదరాబాద్‌కు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆశాలు సూర్య కళ, విజయ, అనిత నాజియా పద్మ తదితరులున్నారు.

అంగన్‌వాడీలను పర్మినెంట్ చేయాలి

- రిటైర్‌మెంట్ బెన్‌ఫిట్స్ కల్పించాలి
- ఇతర డిమాండ్‌లు నెరవేర్చకుంటే 11 నుంచి సమ్మె
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రమేశ్‌బాబు

నవతెలంగాణ-భీంగల్/ఆర్మూర్



ఆర్మూర్‌లో వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

అంగన్వాడి ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కనీస వేతనం 26,000 చెల్లించాలి అని గ్రాడ్యూటీ అమలు చేసి పర్మినెంట్ బెనిఫిట్స్ పెన్షన్ పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రమేశ్‌బాబు డిమాండ్ చేశారు. లేకుంటే 11వ తేదీ నుంచి సమ్మె బాట చేపడతామని స్పష్టంచేశారు. మంగళవారం ఆర్మూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. భీంగల్ లో సీడీపీవో సుధారాణికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్‌బాబు మాట్లాడుతూ

అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్ప్‌ర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దేవగంగు ఆధ్వర్యంలో మంగళవారం సిడిపిఓ సుధారాణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించటం కోసం అనేకమార్లు ప్రభుత్వానికి అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ సమస్యలు పరిష్కరించకపోవడంతో ఈ నెల 11 నుండి రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె నిర్వహించాలని అంగన్వాడి జాయింట్ యాక్షన్ కమిటీ నిర్ణయించిందని తెలిపారు. ఇటీవల రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి గారితో అంగన్వాడీ ఉద్యోగుల చర్చలు జరిగి కొన్ని సమస్యల పరిష్కారానికి ఇచ్చిన హామీని విస్మరించి ఉద్యోగులకు నష్టం చేసే పద్ధతుల్లో ఆదేశాలు ఇవ్వడంతో సమ్మెకు పూనుకోవాల్సి వచ్చిందని, ప్రధానంగా అంగన్వాడీ టీచర్లకు నెలకు 26 వేల రూపాయలు ఆయాలకు 19,000 చెల్లించాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ ను టీచర్లకు పది లక్షలు ఆయనకు ఐదు లక్షలు చెల్లించి వేతనంలో సగం పెన్షన్ చెల్లించాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటి ఇవ్వాలని తదితర 25 డిమాండ్లతో సమ్మె నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. గత నిబంధనల ప్రకారం ఎస్ఎస్‌సి అర్హత ఉన్న హెల్పర్లకు ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని, సీనియార్టీని బట్టి వ్యత్యాసం ఉండాలని, ఇంక్రిమెంట్ సౌకర్యం కల్పించాలి బిఎల్ఓ డ్యూటీ లో రద్దు చేయాలి, ఐసిడిఎస్‌కు సంబంధం లేని పనులను చేయించకూడదని డిమాండ్ చేశారు. మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా గుర్తిస్తూ ప్రకటించిన సర్క్యులర్‌ను వెంటనే జారీ చేయాలి, ఐసిడిఎస్ కు బడ్జెట్ పెంచి బలోపేతం చేయాలి, పక్కా భవనాలు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. సమ్మె కోసం జిల్లాలోని అంగన్వాడీ టీచర్లు ఆయాలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు నాయకులు జ్యోతి, యమునా, చంద్రకళ, లక్ష్మి వసంత తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ : ఆర్మూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టిన డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్, అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు పి చంద్రకళ, గోదావరి, సెక్టార్ లీడర్లు లక్ష్మి, సునంద, పద్మా లక్ష్మి, గోదావరి , జగదాంబ, కవిత తదితరులు పాల్గొన్నారు.

పిట్లం : ఐసిడిఎస్‌లో విధులు నిర్వర్తిస్తున్న అంగన్వాడీ టీచర్లకు, హెల్పర్లకు, మినీ అంగన్వాడీలకు కనీస వేతనం అమలు చేయాలని బాన్సువాడ ప్రాజెక్టు కార్యదర్శి కుమ్మరి రాధా డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ రామ్మోహన్‌రావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 11వ తారీకు నుంచి ప్రాజెక్టుల వారీగా సమ్మె చేపట్టనున్నామని తెలిపారు. కార్యక్రమంలో సుజాత, అనురాధ, జయంతి, జంగం సుమలత, శోభ, సంగీత, కారేగాం అనురాధ, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత..

వర్ని : సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నామని అంగన్‌వాడీ టీచర్లు వర్ని తహసీల్దార్ నారాయణకు మంగళవారం సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్ మాట్లాడుతూ.. టీచర్లకు, ఆయాలకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో టీచర్లు మంగాదేవి, జ్యోత్స్న, అనురాధ, శ్రీదేవి, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పుట్టబోయే బిడ్డ.. అమ్మకానికి బేరం

- నిందితులను పట్టుకొని వివరాలు వెల్లడించిన ఏసీపీ



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కిరణ్‌కుమార్

నవతెలంగాణ-కంఠేశ్వర్

పుట్టబోయే బిడ్డను బేరానికి పెట్టిన నిందితులను పోలీసులు పట్టుకొని అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఏసీపీ కిరణ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ నగరంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన దేవి అనే మహిళ తనకు పుట్టే బిడ్డను పోషించే స్తోమత లేక అమ్మేద్దామని ప్రయత్నించింది. అందుకు దుబ్బ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో పని చేస్తున్న ఆశా వర్కర్ సలుంకే జయ అనే మహిళను సంప్రదించింది. ఆమె డబ్బులకు ఆశపడి నిజామాబాద్ నగరంలోని నాగారానికి చెందిన అమీనా బేగమ్‌కు, ఆటోనగర్‌కు చెందిన షబానా బేగంలకు బిడ్డను అమ్మేందుకు బేరసారాలు మొదలుపెట్టింది. ఆడబిడ్డ పుడితే లక్ష రూపాయలు అని, మగబిడ్డ పుడితే లక్షన్నర రూపాయలని రేటు నిర్ణయించింది. ఆడబిడ్డ పుడితే లక్ష రూపాయలకు అమ్ముతామని అమీనాబేగం, షబానా బేగంల వద్ద రూ.5 వేల చొప్పున అడ్వాన్స్ తీసుకుంది. నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో గోసంగి దేవి మగబిడ్డకు జన్మనివ్వడంతో డెలివరి ఖర్చు కోసం షబానా బేగం నుంచి రూ.20 వేలు తీసుకుంది. ఈ నెల 3న సాయంత్రం నగరంలోని అంబేద్కర్ కాలనీ చౌరస్తాలోని పాత థియేటర్ వద్ద గోసంగి దేవి, ఆశా వర్కర్ సలుంకే జయలు గొడవపడ్డారు. ఈ విషయం తెలిసిన పోలీసులు అక్కడికి చేరుకుని వారిని స్టేషన్ కు రప్పించి విచారించడంతో బిడ్డ అమ్మకం గురించి వెలుగు చూసింది. బిడ్డ అమ్మకానికి మధ్యవర్తిత్వం వహించిన ఆశా వర్కర్ సలుంకే జయ, బిడ్డ తల్లి గోసంగి దేవి, బిడ్డను కొనుగోలుచేయడానికి ప్రయత్నించిన అమీనా బేగం, షబానా బేగంలను అరెస్టు చేసి రిమాండ్ కు పంపుతున్నట్లు ఏసీపీ కిరణ్ కుమార్ తెలిపారు. ఈకేసును చాకచక్యంగా ఛేదించి బిడ్డను అమ్మేందుకు యత్నించిన నలుగురిని అరెస్టులో కీలకపాత్ర పోషించిన నగర సీఐ నరహరి, 3 వటౌన్ ఎస్సై ప్రవీణ్, లను పోలీస్ సిబ్బందిని నిజామాబాద్ ఏసీపీ కిరణ్ కుమార్ అభినందించారు.

నీట మునిగిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు

నవతెలంగాణ-భిక్కనూర్



ఇండ్ల మధ్య నిలిచిన నీటిని చూపుతున్న నాయకులు

మండలం లోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో నీట మునిగిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను బీజేపీ మండలాధ్యక్షులు రమేష్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలోకి వరద నీరు చేరడం పట్ల అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువుకు సమీపంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించారని, దీంతో వర్షం పడిన సమయంలో ఇండ్లలోకి నీరు వచ్చి చేరుతుందని తెలిపారు. ప్రణాళిక లేకుండా ఇష్టం వచ్చిన చోట ఇండ్ల నిర్మాణం చేపట్టి ప్రజాధనాన్ని రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ గ్రామ అధ్యక్షులు నరేందర్‌రెడ్డి, బిజెపి పట్టణ అధ్యక్షులు నరసింహులు, నాయకులు ఏక్‌నాథ్, జైపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, బలరాం, శ్రీనివాస్, బాలరాజ్, మైపాల్‌రెడ్డి, శ్రీనివాస్, రంజిత్, రాకేష్, రాజు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి

- అందుకే గ్రామాలకు పెద్దఎత్తున నిధులు మంజూరు
- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణ-ముప్కాల్/బాల్కొండ




బాల్కొండ మండలంలో శంకుస్థాపన చేస్తున్న మంత్రి వేముల

గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని సీఎం కేసీఆర్ ప్రగాఢంగా విశ్వసిస్తారని, అందుకే గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం విరివిగా నిధులు మంజూరు చేస్తుంటారని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ముప్కాల్, బాల్కొండ మండలాల్లోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేపట్టారు.

ముప్కాల్ మండలంలోని రెంజర్ల గ్రామం నుంచి వన్నెల్ 'బి' వయా న్యూ పార్మేషన్ రోడ్డుకు (రూ.2 కోట్ల 80 లక్షల వ్యయంతో) శంకుస్థాపన చేశారు. అదేవిధంగా గ్రామంలో కొమురంభీం విగ్రహాన్ని తోటి పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. హెల్త్ సబ్ సెంటర్, మహిళ బిల్డింగ్, ప్రాథమిక సహకార సంఘ భవనాలను ప్రారంభించారు. ప్రభుత్వం చేస్తున్న పనులను రాష్ట్ర ప్రజలు గ్రహిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో తిరిగి మళ్ళీ అధికా రంలోకి రావడం పక్క అన్నారు. గత ప్రభుత్వాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, అందులో తెలంగాణ ప్రాంతానికి చేసిన అభివద్ధి శూన్యమ న్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ చేసిన అభివద్ధి పనులే మళ్ళీ తిరిగి అధికారంలోకి వచ్చేలా, రాష్ట్ర ప్రజలు ఆశీర్వాదం అందిస్తారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సామ పద్మ-వెంకట్ రెడ్డి, జడ్పీటీసీ సభ్యులు బద్దం నర్సవ్వ-నర్సారెడ్డి, రెంజర్ల సర్పంచ్ ఆకుల రాజారెడ్డి, వైస్ ఎంపీపీ ఆకుల చిన్న రాజన్న, పార్టీ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి, సొసైటీ చైర్మన్ కె.గంగాధర్, ఉప సర్పంచ్ మోహన్ రెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ : బాల్కొండ మండలం వన్నెల్ బి గ్రామంలో వన్నెల్ బి లింక్ రోడ్ టు వెంపల్లి రేంజర్ల న్యూ ఫార్మేషన్ రోడ్ 1.00 కోటి రూపాయలతో పనులకు శంకుస్థాపన చేశారు. బోదెపల్లిలో అప్రోచ్ బిటి రోడ్ 1 కోటి రూపాయలతో సింగిల్ లైన్ నుండి డబుల్ రోడ్‌గా పనుల ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పిటిసి దాసరి లావణ్య వెంకటేష్, ఎంపీపీ లావణ్య లింగా గౌడ్, వైస్ ఎంపీపీ శ్రీకాంత్ యాదవ్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి, ఎంపీటీసీలు, వివిధ గ్రామాల సర్పంచ్,ఉప సర్పంచ్, మండల గ్రామ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కండ్ల అద్దాలు పంపిణీ



విద్యార్థులుకు అద్దాలు అందజేత

నవతెలంగాణ-కోటగిరి

పోతంగల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ భవానీ ఆధ్వర్యంలో ఏడుగురు విద్యార్థులకు ఆరువేల రూపాయల విలువ గల కండ్ల అద్దాలను ఉచితంగా అందజేశారు. పేద విద్యార్థులకు కండ్ల అద్దాలను అందజేయడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో సభ్యులు కోయాడ శ్రీనివాస్‌గౌడ్, పళ్లెంపాటి శ్రీధర్, బర్ల మధు, ఉదయ్ చందర్, రీజనల్ చైర్మన్ జ్ఞానేశ్వర్ డోలే పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు ప్రశంసా

నవతెలంగాణ ఆర్మూర్

మండలంలోని గోవింద్ పెట్ ప్రాథమిక పాఠశాల ఇంచార్జ్ ఉపాధ్యాయురాలుగా సేవలు అందిస్తున్న మాడవేడి పద్మావతిని మంగళవారం జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి ప్రశాంత్ రెడ్డి చేతుల మీదుగా సన్మానించి, ప్రశంసా పత్రం అందజేసినారు.. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ దాదన్న గారి విట్టల్ రావు, జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ , అధికారులు, టీచర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



పద్మావతిని సన్మానిస్తున్న మంత్రి, జడ్పీచైర్మన్

కరాటేలో గెలుపొందిన విద్యార్థినులకు సన్మానం

నవతెలంగాణ-ఏర్గట్ల

గతకొన్ని రోజుల క్రితం సిద్దిపేటలో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే లో గెలుపొంది పతకాలు సాధించిన విద్యార్థులను మంగళవారం సన్మానించారు. ఎన్. శ్రీనిధి, ఎస్.లతిక, అస్నియా భానును ఏర్గట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తరపున హెచ్.ఎం మునిరోద్దీన్, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో కరాటే ఇన్‌స్ట్రక్టర్ పసునూరి అవినాష్ పాల్గొన్నారు.



రెగ్యులరైజ్ చేయాలి

- కాంట్రాక్టు ప్రొఫెసర్లు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు తమను రెగ్యులరైజేషన్ చేయాలని ఉద్యమాన్ని ఉధృతం చేశారు. మంగళవారం యూనివర్సిటి ప్రధాన ద్వారం వద్ద టెంటు వేసి నిరసన కార్యక్రమాలను చేపట్టారు. తమను రెగ్యులర్ చేయాలని నిరసన కార్యక్రమాలు చేపట్టి వంద రోజులు దాటిన ప్రభుత్వ పెద్దలు పట్టించుకోక పోవడంతో అందళన కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టినట్లు అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్. వి. దత్తాహరి తెలిపారు. అనంతరం నరిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో తెయూ మాజి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ కనకయ్య మాట్లాడుతు కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యను 'పరిష్కరించి యూనివర్సిటీ అభివృద్ధికి దోహదపదాలన్నారు. కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెస్లను రెగ్యులర్ చేస్తే యునివర్సిటలకు రావల్సన యుజిసి, రూసా తదితర నిధులు సమకూరి పరిశోధనల్లో అగ్ర భాగాన చేరుతుందన్నారు. అనంతరం మాజీ ప్రిన్సిపాల్ డా. నాగరాజు మాట్లాడుతు కాంట్రాక్టు అధ్యాపకుల నిరసనతో విద్యావ్యవస్థ కుంటు పడుతుందని అందోళన వ్యక్తం చేశారు. హిందీ విభాగానికి చెందిన ఆచార్యులు డా. జమిల్ మాట్లాడుతూ కాంట్రాక్టు అధ్యాపకుల రేగులరైజేషన్ డిమాండ్‌ను ప్రభుత్వ పెద్దలు పరిష్కరించాలన్నారు. విద్యార్థి సంఘాల నాయకులు ప్రసాద్. గౌతమ్ కుమార్ మద్దతును ప్రకటించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ వెంటనే స్పందించి రెగ్యులర్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో అసోషియేషన్ రాష్ట్ర ప్రతినిధులు పాల్గొన్నారు. ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యులు బచ్చనబోయిన శివ, ఇతర నాయకులు పాల్గొని మద్దతు ప్రకటించారు.

తగ్గిన వంటగ్యాస్ ధర

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎల్పిజి వంటగ్యాస్ సబ్సిడీ రాయితీ సిలిండర్ ధరను ఈనెల అనగా సెప్టెంబర్ ఒకటవ తేదీ నుండి కేంద్ర ప్రభుత్వం తగ్గించిందని తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు మాయావార్ రాజేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో వంటగ్యాస్ ధర 1178 రూపాయల యాభై పైసలు ఉండగా ప్రస్తుత ధర 978 రూపాయల 50 పైసలకు ఉందని తెలిపారు. వినియోగదారులు నేరుగా గ్యాస్ ఏజెన్సీ వద్దకు వెళ్లి గ్యాస్ బండను తీసుకుంటే 19 రూపాయల 50 పైసలు తగ్గించి 959 రూపాయలకు వినియోదారులకు అందించాలని గ్యాస్ డీలర్లను కోరారు. గ్యాస్ ఏజెన్సీ డీలర్లు ఎక్కువ డబ్బులు అడిగితే జిల్లా పౌరసరఫరాల అధికారులకు ఫిర్యాదు చేయాలని వినియోగదారులను కోరారు.

ఔషధ నియంత్రణ అధికారుల దాడులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

కమ్మర్ పల్లి, మోర్తాడ్ మండల కేంద్రాల్లోనీ మందుల దుకాణాలపై మంగళవారం ఔషధ నియంత్రణ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఔషధ నియంత్రణ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్త దాడుల్లో భాగంగా కమ్మర్ పల్లి, మోర్తాడ్ మండల కేంద్రాల్లో ఔషధ నియంత్రణ అధికారులు మందుల దుకాణాలపై ప్రత్యేక దాడులు నిర్వహించారు. మందుల దుకాణాల్లో నార్కోటిక్ మందులను తనిఖీ చేశారు. తనిఖీ నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తామని అధికారులు తెలిపారు. అనంతరం ఔషధ నియంత్రణ అధికారులు మాట్లాడుతూ... డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా నార్కోటిక్ డ్రగ్స్ (మత్తు కలిగించే మందులు) విక్రయించరాదని హెచ్చరించారు. ఆదేశాలను బేఖాతరు చేసి నార్కోటిక్ మందులు విక్రయిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ దాడుల్లో డ్రగ్స్ ఇన్స్పెక్టర్లు ఆర్. శ్రీలత, వి.ఉపేంద్ర, వి. శ్రీకాంత్, ఏ. శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



మందులను తనిఖీ చేస్తున్న అధికారి

పంట పొలాల్లో మద్యం సీసాలు

నవతెలంగాణ-మోర్తాడ్

మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూమ్ సమీపంలో గల వ్యవసాయ భూముల్లో రెండు రోజుల నుంచి గుర్తుతెలియని వ్యక్తులు మద్యం సీసాలు పడేయడంతో ఇబ్బందులకు గురవుతున్నా మని రైతుల అంటున్నారు. డబుల్ బెడ్ రూమ్ సమీపంలోనే వ్యవసాయ పంట భూములు ఉన్నాయని, డబుల్ బెడ్ రూమ్‌లోని కొంతమంది మద్యం సేవించి పంట పొలాలలోనే మద్యం సీసాలు పడవేయడంతో పొలాలకు వెళ్లే సమయంలో పగిలిన మద్యం సీసాలవల్ల రైతులకు గాయాలు చేసే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నివాస గృహ సభ్యులు పంట పొలాలలో మద్యం సీసాలు వ్యర్థ పదార్థాలు పడవేయకుండా సంబంధిత పంచాయతీ అధికారులు కాలనీవాసులకు సూచనలు ఇవ్వాలని అన్నారు. మద్యం సీసాలు పగిలి వ్యవసాయ క్షేత్రంలో పడి ఉండడంతో వాటిని గమనించని రైతులు పంట పొలాలకు నీరు పారించడానికి వెళ్లే సమయంలో రైతు కాళ్లకు గాయాలయ్యే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. గ్రామపంచాయతీ అధికారులు స్పందించి డబుల్ బెడ్ రూమ్ కాలనీవాసులకు అవగాహన కల్పించి రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరుతున్నారు. ఈ విషయమై సంబంధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.



పొలంలో పారేసిన మద్యంసీసాలు

ఆశా కార్యకర్తలకు హెచ్‌బీఎన్‌సి కిట్ల పంపిణీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇందల్ వాయిలో మంగళవారం ఆశా కార్యకర్తలకు హెచ్‌బీఎస్ సి (హెల్త్ బేస్డ్ నియోనేటల్ కేర్)కిట్లను ఇందల్ వాయి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ సంతోష్ కుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కిట్లు ప్రసవణ అనంతరం శిశువు తల్లి ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించడానికి బాలింత ఇంటికి వెళ్లి వారికి తగు జాగ్రత్తలు వివరించవలసి ఉంటుందని వైద్యాధికారి వివరించారు.ఈ కిట్లో మొత్తం తొమ్మిది వస్తువులు ఉంటాయని వివరించారు. ఈ కిట్టు తీసుకొని ఆశా కార్యకర్త ప్రసవానంతరం బాలింత ఇంటికి వెళ్లి శిశువు తల్లి టెంపరేచర్, పల్స్ రేట్, శిశువు బరువు తూచడం చేయాలన్నారు.ప్రతి ఒక్క ఆశా కార్యకర్త వారి ఇంటికి వెళ్లవల్సి ఉంటుందని సూచించారు. ప్రసవానంతరం తల్లికి, బిడ్డకు జరిగే అనివార్యమైన సమస్యల గురించి రక్షించుట కొరకు ఈ కిట్టు ఉపయోగపడు పడ్తుందని తెలిపారు. మండల ఆరోగ్య విస్తరణాధికారి వై.శంకర్ కిట్‌లోని వస్తువుల ఉపయోగాలను వివరిస్తూ ప్రతి ఒక్క ఆశా కార్యకర్త వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్, పర్యవేక్షణ అధికారులు అక్బర్ అలీ, ఉమారాణి ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

భావిభారత పౌరులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే

- అధ్యాపకులకు సన్మానం
- ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

నవతెలంగాణ-విలేకరులు

డిచ్‌పల్లి: విజ్ఞాన వెలుగుల్ని ప్రతి విద్యార్థిలో నింపిన ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రావు అని, అయన చేసిన సేవలను గాను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారని ఎంపిటిసి చింతల దాస్ అన్నారు. మంగళవారం ఇందల్ వాయి మండల కేంద్రంలోని తిర్మన్ పల్లి లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామం లోని ప్రాథమిక, ఉర్దూ అప్పర్ ప్రైమరీ పాఠశాల, గంగారాం తండా లోని ప్రాథమిక పాఠశాలకు చెందిన అధ్యాపకులను, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన శ్రీనివాస్ రావు, మండల ఉత్తమ ఉపాధ్యాయులు ఉమారాణి, కరణం రాజు లను ఎంపిటిసి, గ్రామ అభివృద్ధి కమిటీ, ఎస్ ఎంసి లో అధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపిటిసి మాట్లాడుతూ తిర్మన్ పల్లి పాఠశాల పేరు ప్రఖ్యాతులు సంపాదించే విధంగా శ్రీనివాస్ రావుతోపాటు అధ్యాపక బృందం ప్రత్యేక కృషిచేయడం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో గ్రామం పేరు తేవడానికి కృషి చేయడం హర్షించదగ్గ విషయ మన్నారు. ముందుగా సర్వే పల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. కార్యక్రమం లో గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ గోపు గోవర్ధన్, ఉపాధ్యక్షులు మదం వెంకటీ, కిషన్,తెడ్డు మహేందర్, మహేష్, లింగన్న,గాండ్ల గంగాధర్, కొమురయ్య,పుట్నల శ్రీనివాస్, శివారం, సాయిలు, రమేష్, శ్రీను, గంగేశ్వర్, పాఠశాల చైర్మన్ ఇమ్మడి సాయిలు తో పాటు అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్కొండ: మండల కేంద్రంలోని శాంభవి హైస్కూల్ లో యాజమాన్యం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడిగా ఆయన చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు. అనంతరం పాఠశాలలోని ఒకటి నుంచి 5వ తరగతి వరకు ఎఫ్ఏ వన్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా పిల్లలకు ఫస్ట్, సెకండ్ బ్యాడ్జీలు అందజేశారు. 6 నుండి 10వ తరగతి వరకు ప్రశంసా పత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మధుసూదన్ రాజు, కరస్పాండెంట్ రవీన్ ప్రసాద్, ప్రిన్సిపాల్ ఇంద్రాణి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండల కేంద్రంలోని మైనారిటీ గురుకుల బాలికల పాఠశాలలో ప్రిన్సిపాల్ వాణి డాక్టర్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ చిన్నయ్య మాట్లాడుతూ రాధాకృష్ణన్ చేసిన సేవలను విద్యార్థులకు తెలియజేస్తూ విద్యార్థులు కూడా మీరు జీవితంలో ఉన్నతమైన స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

కంఠేశ్వర్: నిజామాబాద్ నగరంలోని మారుతినగర్‌లోగల స్నేహ సొసైటీఫర్ - రూరల్ రీకన్‌స్ట్రక్షన్ వారి దివ్యాంగుల పాఠశాలలో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జిల్లా పరిషత్ చైరన్ దాదన్నగారి విఠల్ రావ్ పాల్గొన్నారు. మొదట సర్వేపల్లి రాధకృష్ణన్ చిత్రపటానికి పూల మాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విట్టల్ రావు మాట్లాడుతూ.. అజ్ఞానం అనే చీకటిని పారద్రోలి, విద్య అనే విజ్ఞానాన్ని అందించే వారే గురువు అని అన్నారు. గురువుల వల్లనే ఉద్యోగులుగా రాజకీయ నాయకులుగా మంచి స్థాయికి చేరుకోగలిగారని తెలిపారు. గౌరవ అతిధిగా విచ్చేసిన జిల్లా సంక్షేమ అధికారి రసూల్‌బి మాట్లాడారు. గురువులు తనకు అందించిన విద్యా బుద్దులతోనే ఈరోజు ఈ స్థాయిలో ఉన్నానని, తన గురువుల తన చదువుకున్న పాఠశాలకు ఆమె దన్యవాదాలు తెలియజేసారు. దివ్యాంగుల పాఠశాలలో దివ్యాంగులకు విద్యాబుద్ధులు బోధిస్తున్నా ఉపాధ్యాయులు అందరికీ ధన్యవాదాలు తెలిపారు.



మెండోర మండలం వెల్గటూర్ లిటిల్‌ఫ్లవర్‌లో

కార్యక్రమములో పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులతోపాటు స్నేహ సొసైటీ రీకన్‌స్ట్రక్షన్ ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపల్ రాజేశ్వరి, యస్. వెంకటలక్ష్మి ఉపాధ్యాయురాలు మానసిక వికలాంగుల పాఠశాల జి. సుధ ఉపాద్యాయురాలు, వై. రాజశ్రీ ఉపాధ్యాయురాలు అంధుల ప్రత్యేక పాఠశాల ఉపాద్యాయులను ఘనంగా సత్కరిచారు. కార్యక్రమంలో మానసిక వికలాంగ విద్యార్థులు, అంధవిద్యార్థి వారి వారి టీచర్లను అనుకరించి ఉపాధ్యాయులను గౌరవించారు. ఉపాధ్యాయులందరినీ ఘనంగా సన్మానించి బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. కార్యక్రమములో స్నేహ సోసైటీ కార్యదర్శి యస్.సిద్దయ్య, రాజేశ్వరి, తెలంగాణ శంకర్, మానసిక వికలాంగుల పాఠశాల సిబ్బంది, అందుల పాఠశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



కంఠేశ్వర్: స్నేహసొసైటీలో

జక్రాన్‌పల్లి : మండలంలోని తొర్లికొండ ప్రాథమిక. ఉన్నత, సంతోష్ నగర్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను మంగళవారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పద్మ, ఉప సర్పంచ్ భూమేశ్వర్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు జీవన్, ఉపాధ్యక్షులు కార్యదర్శి, కోశాధికారి జానకిరామ్, సభ్యులు పాల్గొన్నారు, సన్మానం పొందిన వారిలో హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు రేణుక, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంగం అశోక్, రామకృష్ణ, హరి జీవన్, పి గంగాధర్, జె సుందర్, సంకేపల్లి గంగాధర్, డి రాజేందర్, సునీత, లక్ష్మీ నరసింహారావు, ఇతర ఉపాధ్యాయులు ఉన్నారు.

కంఠేశ్వర్: విజయ్ -హైస్కూల్‌లో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా గత 15 సంవత్సరాలుగా తమ సేవలను అందిస్తున్న ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయునులైన అరుణ్జ్యోతి, యస్.సుజాతలను స్కూల్ యాజమాన్యం సన్మానించారు.అనంతరం 10వ తరగతి విద్యార్థినీ విద్యార్థులు 'ఉపాధ్యాయులు'గా వ్యవహరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయబృందాన్ని స్కూల్ వ్యవస్థాపకులు డా. అమృతలత అభినందించారు.

ఆర్మూర్ : పట్టణంతోపాటు గ్రామాల్లో మంగళవారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవంను నిర్వహించారు. పట్టణంలోని మామిడిపల్లి నలంద హై స్కూల్లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందాన్ని స్కూల్ యాజమాన్యం విద్యార్థుల చేతుల మీదుగా సన్మానించారు. విద్యార్థులు గురువుల గొప్పతనం గురించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం ప్రసాద్, సాగర్ అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టణ బార్ అసోసియేషన్ అధ్యక్షులు సరసం చిన్నారెడ్డి అధ్యక్షతన న్యాయమూర్తులు నసీం సుల్తానా, వేముల దీపీలను సన్మానించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు మోహన్ దాస్ ఆధ్వర్యంలో పట్టణంలోని విజయ్ హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయురాలు కవిత దివాకర్ పాల్గొనగా విద్యార్థిని విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గాంధీనగర్ ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో యాజమాన్యం మానస గణేష్, పద్మను ఉపాధ్యాయ బృందం సన్మానించారు.

కంఠేశ్వర్: కేర్ డిగ్రీ కళాశాల ఆవరణంలో మహిళ అధ్యాపకులను, కళాశాల అధ్యాపకులను డిగ్రీ కళాశాల డైరెక్టర్ నరాల సుధాకర్ ఘనంగా శాలువాతో సత్కరించి బొకేను అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ నరాల సుధాకర్ మాట్లాడుతూ.. మొదట తల్లిదండ్రులు గురువులైతే ఆ తరువాత అధ్యాపకులు తల్లిదండ్రుల స్థానానికి వెళ్లి గురువులౌతారని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ నరేష్, సందేశ్, సందీప్ పాల్గొన్నారు.



డిచ్‌పల్లి : ఉపాధ్యాయులను సన్మానించిన వీడీసీ, ప్రజాప్రతినిధులు



బాల్కొండ : మైనారిటీ గురుకుల పాఠశాలలో...

మోపాల్: మండలంలోని మంచిప్ప గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను జై భారత్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో జై భారత్ యూత్ అధ్యక్షులు సాయిరాం. సర్పంచ్ సిద్ధార్థ మాట్లాడారు. వీడీసీ అధ్యక్షులు నవీన్, మండల కో ఆప్షన్ మెంబర్ అజీమ్ , ఉప సర్పంచ్ జగదీష్ యాదవ్, గ్రామ అభివృద్ధి కమిటీ మెంబర్లు, ప్రధానోపాధ్యాయులు గోపాల చారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు



ఆర్మూర్ :నలంద పాఠశాలలో సన్మాన కార్యక్రమం

కమ్మర్‌పల్లి: మండలంలోని ఉప్లూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఉపాధ్యాయులను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బద్దం చిన్నారెడ్డి శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యులు సిరిమల్ల దేవన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జక్రాన్‌పల్లి : ఉపాధ్యాయులను సన్మానించిన వీడీసీ

నిజామాబాద్: మెండోరా మండలంలోని వెల్గటూర్ గ్రామంలో లిటిల్ ఫ్లవర్ హై స్కూల్ కరస్పాండెంట్ అజ్మత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు మధ్య ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు.



కమ్మర్‌పల్లి : ఉప్లూర్‌లో..

మాక్లూర్: విద్యార్థిని, విద్యార్థులను ఉన్నత స్థానాల్లో నిలబెట్టే సామర్థ్యం ఉపాధ్యాయులతో ఉందని జడ్పీ చైర్మన్ దాదాన్నగారి విఠల్ రావు అన్నారు. మండల కేంద్రంలోని ఎస్ఆర్ గార్డెన్ హాల్లో 26 మంది ఉత్తమ ఉపాధ్యాయుల సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా పరిషత్ చైర్మన్ దాదాన్నగారి విఠల్ రావు పాల్గొని ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి చాలా విలువ, గౌరవం ఉన్నదని, తల్లి తండ్రులు జన్మనిస్తే పిల్లలను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే అవకాశం ఒక్క ఉపాధ్యాయులకు మాత్రమే దక్కుతుందని అన్నారు. విద్యార్థులు ఉన్నతమైన స్థానాన్ని అధిరోహించినప్పుడే గురువులకు మంచి గుర్తింపు వస్తుందన్నారు. రాజకీయాల్లో ఈ స్థానాల్లో ఉన్నామంటే తమ గురువుల వల్లేనని తెలిపారు. అనంతరం దాస్‌నగర్ సమీపంలో గల మహాత్మా జ్యోతిభా పూలే రెసిడెన్షియల్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మస్త ప్రభాకర్, ఎంపీడీఓ క్రాంతి, తహశీల్దార్ షబ్బీర్, మండల విద్యాశాఖ అధికారి రాజగంగారెడ్డి, ఏంజేపి ప్రిన్సిపల్ సంజీవ్ రెడ్డి, సర్పంచ్ అశోక్ కుమార్, ఎంపిటిసి వెంకటేశ్వర్ రావు, పీఆర్టీయూ మండల అధ్యక్షులు లక్ష్మి నారాయణ పాల్గొన్నారు.



మాక్లూర్‌లో...



డిచ్‌పల్లి : శ్రీనివాస్‌రావును సన్మానిస్తున్న మంత్రి, కలెక్టర్

రిజిస్ట్రార్ ఎం.యాదగిరికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం యాదగిరికి తెలంగాణ రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు లభించింది. రాష్ట్ర రాజధాని హైదరాబాదులోని రవీంద్ర భారతి కళా నిలయంలో జరిగిన గురుపూజోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర విద్యామంత్రి సబితా ఇంద్రారెడ్డి అధ్యక్షత వహించగా, ఉప ముఖ్యమంత్రి,హోం శాఖ మంత్రి మహిముద్ అలీ ముఖ్యఅతిథిగా, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ లింబాద్రి, శాసనమండలి సభ్యులు వివిధ యూనివర్సిటీ లవైస్ ఛాన్సలర్ లు హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం యాదగిరిని శాలువా, మెమోంటో పూలమాలలతో ఘనంగా సత్కరించి ప్రోత్సాహకంగా నగదు పారితోషకం పదివేల రూపాయలు అందజేశారు. అవార్డు వచ్చిన సందర్భంగా ప్రొఫెసర్ యాదగిరిని ప్రొఫెసర్లు, అన్ని శాఖల విభాగాధిపతులు టీచింగ్ నాన్ టీచింగ్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

రేపు 'శ్రీ కృష్ణ జన్మాష్టమి' వేడుకలు

నవతెలంగాణ - ముప్కాల్

శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఈ నెల 7న గురువారం రోజు ఘనంగా చేపట్టడం జరుగుతుందని ముప్కాల్ శ్రీ కృష్ణ యాదవ పెద్ద సంఘం' అధ్యక్షులు కట్ట గోపి, సెక్రటరీ ట్రాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. గురువారం అన్నదాన కార్యక్రమం, మధ్యాహ్నం శ్రీవారి ఊరేగింపు, సాయంత్రం 5 గంటల సమయంలో మార్కెట్ యార్డ్ స్థలంలో ఉట్టి కొట్టే కార్యక్రమం ఉంటుందన్నారు. మండలం నుంచి అధిక సంఖ్యలో యువకులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. అదేవిధంగా వేంపల్లి, వెంచిర్యాల గ్రామాల్లో సైతం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆయా సంఘం పెద్దలు తెలిపారు..

పద్మశాలీ సంఘం అధ్యక్షుడికి సన్మానం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

బాల్కొండ నియోజకవర్గ పద్మశాలీ సంఘం అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన ఏర్గట్ల మండలం తాళ్ల రాంపూర్‌కు చెందిన ఎనుగందుల పూర్ణానందంను కమ్మర్‌పల్లి మండల పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. మండలంలోని చౌట్‌పల్లి పద్మశాలి సంఘ భవనంలో నిర్వహించిన సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షుడు పూర్ణానందం, వర్కింగ్ ప్రెసిడెంట్ జోగు నర్సయ్య, ఉపాధ్యక్షుడు ఎలిగేటి మధుకర్, ప్రధాన కార్యదర్శి పోతు ధరణికుమార్, కోశాధికారి మామిడాల వినోద్‌కుమార్‌లను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో నూతనంగా ఎన్నుకోబడ్డ గ్రామ అధ్యక్షులను సన్మానించారు. హసకొత్తూర్, బషీరాబాద్, చౌట్‌పల్లి, కోనాసముందర్, నర్సాపూర్, కోనాపూర్, నాగాపూర్ గ్రామ అధ్యక్షులు పురుషోత్తం, రవి, కృష్ణమురళి, బాపూజీ, రాజ్‌కుమార్, లక్ష్మీనారాయణ, అరవింద్‌లను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్షుడు పూర్ణానందం మాట్లాడుతూ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మండలంలోని 8 పద్మశాలీ సంఘ భవనాలకు గాను రూ. 36 లక్షల నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పులగం హన్మాండ్లు, మండలాధ్యక్షుడు చింత తిరుపతి, భూమేశ్వర్, కమ్మర్‌పల్లి అధ్యక్షుడు చింత శ్రీనివాస్, ఉప్లూర్ అధ్యక్షుడు పోతు లింగమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



సన్మానించిన సంఘం సభ్యులు

125 కోట్లతో అభివృద్ధి చేసిన ఘనత మంత్రి ప్రశాంత్ రెడ్డిదే

- వంద పడకల ఆసుపత్రి పనులను పరిశీలించిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-భీంగల్

భీంగల్ మండలాన్ని 125 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టి ప్రజల మనిషిగా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి నిలుస్తున్నాడని జెడ్పిటిసి చౌటుపల్లి రవి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సయ్య, జిల్లా నాయకుడు కన్నె సురేందర్ అన్నారు. పట్టణ కేంద్రంలో ప్రభుత్వం నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాల్కొండ నియోజకవర్గంలో ఏ నాయకుడు చేయని అభివృద్ధిని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్ని వర్గాలకు చేసి చూపిస్తున్నారన్నారు. వంద పడకల ఆసుపత్రి మరో మూడు నెలల్లో పూర్తికానున్నదని అన్నారు. భీంగల్ బస్ డిపోను పున ప్రారంభించనున్నారని వాటి పనులు కూడా కొనసాగుతున్నాయని తెలిపారు. పట్టణంలో సెంట్రల్ లైటింగ్ పరిధిని మరింత పెంచేందుకు 12 కోట్లు, పాఠశాలలకు మూడు కోట్లను మంత్రి మంజూరు చేశారని వారు తెలిపారు. పనులను పూర్తి చేయాలని ఏఈకీ సూచించారు. వీరి వెంట కౌన్సిలర్ సతీష్ గౌడ్, బీఆర్ఎస్ నాయకుడు తిరుపతి, తదితరులు ఉన్నారు

బీఆర్ఎస్‌లో పలువురి చేరికలు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



గత 3 రోజుల క్రితం కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ ఉపాధ్యక్షుడు మదన్ మోహన్ సమక్షంలో సర్వాపూర్ సర్పంచ్ కొడుకు బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆధ్వర్యంలో తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా రాజుకు ఎమ్మెల్యే జాజాల సురేందర్ పార్టీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఆయన వెంట రెడ్డి రాజులు, గంగాధర్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ పరిశీలించిన జిల్లా కలెక్టర్

నవతెలంగాణ-తాడ్వాయి



ఎస్పీ ఆఫీసు సమీపంలో గల ఈవీఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మంగళవారం సందర్శించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్‌లు, ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన గదులను పరిశీలించారు. సిబ్బంది విధులు నిర్వహిస్తున్న తీరును, పోలీసు భద్రతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు అనిల్ కుమార్, ఇందిర తదితరులున్నారు.

విద్యార్థుల బంగారు భవిష్యత్తులో

కీలకపాత్ర ఉపాధ్యాయులదే

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

- ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం
- పలు పాఠశాలల్లో స్వయం పాలన దినోత్సవం



లింగంపేట్: ఉపాధ్యాయులకు సన్మానం



మాచారెడ్డి : స్వయం పాలన దినోత్సవంలో విద్యార్థులు

విద్యార్థుల బంగారు భవిష్యత్తులో కీలకపాత్ర ఉపాధ్యాయులదేనని పలువురు వక్తలు అన్నారు. జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఇక కొన్ని పాఠశాలల్లో స్వయం పాలన దినోత్సవం చేపట్టారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి.. తోటి విద్యార్థులకు బోధించారు.

నవతెలంగాణ-విలేకరుల బృందం

తాడ్వాయి : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అధ్యాపకులను ఆత్మీయంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బండారి సంజీవులు మాట్లాడుతూ.. సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదని పేర్కొన్నారు. విద్యార్థులను ఉన్నత శిఖరాలను చేర్చేందుకు ఉపాధ్యాయుడు నిచ్చెనలా వ్యవహరిస్తారని తెలిపారు. గురువు లేనిదే ఏది సాధ్యం కాదని ఆయన పేర్కొన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకొని ప్రతి ఏటా సెప్టెంబర్ ఐదున ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వయంపాలన దినోత్సవం..

మాచారెడ్డి : మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాల విద్యార్థులు స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి విద్యను బోధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ గంధం బుద్ధిరాజు మాట్లాడుతూ.. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాలలో స్వయంపాలన దినోత్సవం నిర్వహించామన్నారు.

నిజాంసాగర్ : మండల కేంద్రంలోని జవహర్ లాల్ నెహ్రూ నవోదయ పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.సత్యవతి తెలిపారు. సత్యవతి మాట్లాడుతూ.. ప్రతి ఒక్క విద్యార్థి సర్వేపల్లి రాధాకృష్ణ అడుగుజాడలో నడవాలని ప్రతి ఒక్క విద్యార్థి కూడా క్రమ శిక్షణతో ఉండి పెద్దవాళ్లకు గౌరవం ఇస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆమె అన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది..

లింగంపేట్ : అన్ని వృత్తుల కన్నా ఉపాధ్యాయ వృత్తి చాలా విలువైందని ఉన్నతమైనదని లింగంపేట్ ఎంపీపీ గరీబున్నిసా నయీమ్ అన్నారు. మండల కేంద్రంలోని ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక బాలుర ఉన్నత పాఠశాల లింగంపేట్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి రామస్వామి మాట్లాడుతూ.. మండలం నుంచి 26 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, కేజీబీవీ, మైనారిటీ, మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలల నుంచి ఎంపిక చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ఎమ్మెల్యే జాజాల సురేందర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపీపీ గరీబ్‌న్నిసా బేగం నహీం మాట్లాడుతూ.. అన్ని వృత్తుల్లో కెల్లా ఉపాధ్యాయ వృత్తి చాలా ఉన్నతమైనదని, ప్రతీ ఉపాధ్యాయుడు విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతిలో ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు విద్యా ప్రమాణాలు పెంచేందుకు కోట్ల రూపాయల ఖర్చు చేస్తుందని తెలిపారు. మన ఊరు మనబడి తొలి వెలుగు కార్యక్రమాల నిర్వహించడం ద్వారా మంచి ఫలితాలు వచ్చాయన్నారు. అనంతరం ఎంపిడిఓ మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను స్మరించుకున్నారు. ఉత్తమ ఉపాధ్యాయులందరికీ అభినందనలు తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయులు అందరూ తమ ప్రసంగాల ద్వారా వారి అనుభవాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొల్లు లావణ్య, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వహీద్ సిద్దికి, రమేష్, బాలమణి, సురేశ్ వివిధ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయిలో ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం..

ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు జిల్లా స్థాయికి ఎంపికవడంతో వారిని జిల్లా కేంద్రంలోని కళాభారతి ప్రాంగణంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ప్రశంస పత్రాలు అందజేశారు. మండలంలోని శెట్టిపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోధ్యాయులు సాయన్న, కొట్టాలగడ్డ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మైపాల్ ఉత్తమ ఉపాధ్యాయులు ఎంపికవగా కళాభారతి కామారెడ్డి నందు జరిగిన జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల ఉత్సవానికి ముఖ్య అతిథిగా శాసనసభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా పాలనాధికారి జితేష్ వి పాటిల్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్, జుక్కల్ ఎమ్మెల్యే హనుమంతుషిండే, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు పాల్గొన్నారు. లింగంపేట్ నుంచి ప్రాథమిక పాఠశాల కొట్టాలగడ్డ ఉపాధ్యాయులు మహిపాల్, శెట్పల్లి ఉన్నత పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు సాయన్నకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. శాలువా కప్పి పూలదండ వేసి ప్రశంసపత్రాన్ని అందజేశారు. వారు చేసిన సేవలను కొనియాడారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా గోవర్ధన్‌రెడ్డి..

రామారెడ్డి : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ప్రభుత్వం రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా మండలంలోని ఉప్పల్వాయి ప్రధానోపాధ్యాయులు గోవర్ధన్ రెడ్డిని హైదరాబాదులో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సన్మానించి ప్రశంసపత్రాన్ని అందజేశారు. జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా రామారెడ్డి జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న విజయలక్ష్మిని జిల్లా కేంద్రంలోని కళాభారతిలో శాలువాతో సన్మానించి, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వారిని అభినందించారు.

బిచ్కుంద డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం..

బిచ్కుంద : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా బిచ్కుంద మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి ప్రిన్సిపాల్ చంద్రముఖర్జీ పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు. సర్వేపల్లి రాధాకృష్ణ జీవిత విశేషాలను ఆయన చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. బిచ్కుంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో త్వరలో పీజీ కోర్సులు, ఎన్‌సీసీ కూడా వస్తున్నాయని ఈ కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇక్కడ విద్యాభ్యాసం చేసిన విద్యార్థులు సమాజం గర్వించే విధంగా పెద్ద స్థానాల్లో గొప్ప వ్యక్తులుగా ఎదిగి కళాశాలకు తల్లిదండ్రులకు ఈ ప్రాంతానికి పేరు తేవాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

లింగంపేట్ : మండలంలోని ఉత్తమ ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉన్నత పాఠశాలలో ఎంపీపీ గరీబున్నిసా నయీమ్, సర్పంచ్ బొల్లు లావణ్య, ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించినట్టు మండల విద్యాధికారి రామస్వామి తెలిపారు. మండలంలోని ఆయా పాఠశాలలో 24 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసినట్టు వివరించారు. అదేవిధంగా క్లస్టర్ రిసోర్స్ పర్సన్ సత్యనారాయణను ఎంపిక చేశామన్నారు. వారి సేవలను గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయులకు ఎంపిక చేస్తామన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి శాలువా కప్పి పూలదండ వేసి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో గురుపూజోత్సవం..

రెంజల్ : మండల కేంద్రమైన రెంజల్ ఆదర్శ పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని పాఠశాల యాజమాన్యం గురుపూజోత్సవ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బలరాం మాట్లాడుతూ.. అత్యున్నత భారత రాష్ట్రపతి పదవిని చేపట్టిన ఘనత సర్వేపల్లి రాధాకృష్ణన్‌కే దక్కిందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో గురుపూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ మాట్లాడుతూ.. గురువులే ప్రత్యక్ష దైవమని భావితరాలను బంగారు భవిష్యత్తు వేసే బాటలో ఉపాధ్యాయులది కీలక పాత్ర అని అన్నారు. ఈ సందర్భంగా పదిమంది ఉత్తమ ఉపాధ్యాయులకు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకటేశం, ఆదర్శ స్కూల్ పాఠశాల ప్రిన్సిపాల్ సాయిబాబా విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



తాడ్వాయి: గురువులకు సన్మానం



రామారెడ్డి : ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న గోవర్ధన్‌రెడ్డి



నిజాంసాగర్‌లో..

నిధులు కేటాయించాలని వినతి



వినతిపత్రాన్ని అందజేస్తున్న సంఘం సభ్యులు

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని ముదిరాజ్ సంఘం సభ్యులు నిధులు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం బోధన్ ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. పెద్దమ్మ గుడి ప్రహరీ గోడ, సంఘ భవనానికి నిధులు కేటాయించాలని వారు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు తగిలేపల్లి అంజయ్య, మమ్మాయి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కురుమ సంఘం భవనం కోసం ఎమ్మెల్యేకు వినతి

నవతెలంగాణ-బోధన్

సాలూర మండల కేంద్రంలో కురుమ సంఘం భవన నిర్మాణానికి నిధులు మంజూరి చేసి ఆదుకోవాలని కోరుతూ మంగళవారం సాలూర గ్రామ బీరప్పా కురుమ సంఘం సభ్యులు ఎమ్మెల్యే షకీల్ ఆమేర్‌కు వినతిపత్రం అందించారు. అలాగే బీరప్పా దేవాలయం వద్ద కరెంటు సౌకర్యం లేక అంధకారం ఉందని కావున రాత్రివేళ సౌకర్యవంతంగా పనులు చేసుకోడానికి కరెంటు సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం శాసనసభ ఎన్నికల్లో తమ సంఘం సభ్యులు బీఆర్ఎస్ పార్టీకే ఓటు వేస్తామని కోరుతూ ఏకగ్రీవ తీర్మానం కాపీ అందించారు.

విద్యుత్ సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-గాంధారి

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ డీఈఈ గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం 6-9-2023 గాంధారి మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో సీజీఆర్ఎఫ్ విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక ఉదయం 10 గంటల నుంచి 1 గంటల వరకు కలదని, గాంధారి, సర్వాపూర్, లింగంపేట్, శెట్పల్లి సంగారెడ్డి, నాగిరెడ్డిపేట్, ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని డీఈఈ గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

దక్షిణ ప్రాంగణంలో రిలే నిరాహార దీక్షలు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని బిటిఎస్ వద్ద గల తెలంగాణ విశ్వవిద్యాలయ దక్షిణ ప్రాంగణంలో కాంట్రాక్ట్ అధ్యాపకులు మంగళవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నారాయణ గుప్తా మాట్లాడుతూ 106 రోజుల నుండి సమస్యలు పరిష్కారం కొరకు ఆందోళన చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని, సమస్యలు పరిష్కారం అయ్యేవరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తామని తెలిపారు. సౌత్ క్యాంపస్‌లో ముఖ్యమంత్రి నివేదన సభ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు పాల్గొననున్నట్టు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని, లేనిచో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు యాలాద్రి, సునీత, నరసయ్య, రమాదేవి, నిరంజన్, సరిత, వైశాలి, శ్రీమాత తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిపోయిన ఇండ్లు



బాధితులను పరామర్శిస్తున్న ఎంపీటీసీ

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన నరసయ్య, నరసింహులు, నాగులు నివాసం ఉంటున్న ఇండ్లు వర్షాలకు కూలిపోయాయి. దీంతో ఇండ్లల్లో ఉన్న వస్తువులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. విషయం తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ఆస్తి నష్టం అంచనా వేశారు. అనంతరం మల్లుపల్లి ఎంపీటీసీ సభ్యులు మోహన్‌రెడ్డి సైతం గ్రామానికి చేరుకొని బాధితులను పరామర్శించారు. వర్షాల వల్ల ఇండ్లు కూలిపోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని ముదిరాజ్ సంఘం సభ్యులు పెద్ద ఎత్తున బీఆర్ఎస్ పార్టీలో చేరి గులాబీ కండువాను కప్పుకున్నారని సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ సంక్షేమ ఫలాలకు ఆకర్షితులై ఈ పార్టీలో చేరినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు భూమారెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు టి.అంజయ్య, సీనియర్ నాయకులు రఫీక్, స్థానిక నాయకులు అనిల్, సాయగౌడ్, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములకు రుణాలు అందించాలి

- నిజామాబాద్ జిల్లా సహకార బ్యాంకు

డైరెక్టర్ లింగాల కిష్టాగౌడ్

నవతెలంగాణ-భిక్కనూర్



మాట్లాడుతున్న డైరెక్టర్ కిష్టాగౌడ్

అసైన్డ్ భూములలో పంటలు పండిస్తున్న రైతులకు సొసైటీల ద్వారా రుణాలు అందించాలని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సహకార బ్యాంకు డైరెక్టర్ లింగాల కిష్టాగౌడ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అసైన్మెంట్ భూములకు రుణాలు మంజూరు చేయాలని, ఫ్యాక్స్ ద్వారా సీఎంకు లేక పంపినట్టు తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత అసైన్డ్ భూములు సాగు చేస్తున్న రైతులకు సహకార సంఘాల ద్వారా రుణాలు అందించనున్నట్టు తెలిపారు. ఆ తరువాత ప్రభుత్వం రుణాలను నిలిపివేసిందని, తిరిగి రుణాలు ఇవ్వాలని సీఎం కేసీఆర్, వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి, ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌కు విన్నవించారు. ఎంతోమంది రైతులు రుణాలు అందక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రస్తుతం రుణమాఫీ పొందిన రైతులకు సహకార సంఘాల ద్వారా కొత్త రుణాలను అందించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కాచాపూర్ ఉప సర్పంచ్ సిద్ధాగౌడ్, సొసైటీ మాజీ డైరెక్టర్ నీలం రెడ్డి తదితరులున్నారు.

పశు వైద్యుడి బదిలీని రద్దు చేయాలి



సమావేశంలో గ్రామస్తులు

నవతెలంగాణ-మద్నూర్

మేనూర్ పశు వైద్య డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న బండి వార్ విజయ్‌ను ఆకస్మికంగా డిప్యూటేషన్ పేరుతో ఇక్కడి నుంచి బీర్కూరు మండలంలోని రైతునగర్ గ్రామానికి బదిలీ చేయడం సరికాదని, వెంటనే ఆ బదిలీని రద్దు చేయాలని మేనూరు గ్రామస్తులు డిమాండ్ చేశారు. మంగళవారం మేనూర్ సర్పంచ్ విట్టల్ గురూజీ అధ్యక్షతన ఆ గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులు ఆ గ్రామ పెద్దలు చుట్టుపక్కల గ్రామాల పశువుల దారులు ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఇక్కడ విధులు నిర్వహించే పశువైద్య డాక్టర్ విజయ్‌ని ఆకస్మికంగా బదిలీ చేయడం సరైంది కాదని బదిలీ చేసిన డాక్టర్‌ను వెంటనే మేనూర్ డాక్టర్‌గా నియమించాలని, లేనియెడల చుట్టుపక్కల గ్రామాల పశువుల దారులతో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని తీర్మానించినట్టు తెలిసింది. పశువైద్య డాక్టర్ ఎంతో మంచి వ్యక్తి అని అలాంటి వ్యక్తిని ఇక్కడి నుంచి డిప్యూటేషన్ పేరుతో బదిలీ చేయడం సరైనది కాదని బదిలీ చేసిన డాక్టర్ బండి వార్ విజయ్‌ని వెంటనే డిప్యూటేషన్ రద్దుచేసి మేనూర్ డాక్టర్‌గా నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మోహన్, గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులు, గ్రామపెద్దలు, పశువుల పెంపకందారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



నవతెలంగాణ-భీంగల్

ఉపాధ్యాయ దినోత్సవం మండలంలోని ప్రైవేటు ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా జరుపుకున్నారు. పట్టణ కేంద్రంలోని శ్రీ సరస్వతి విద్యా మందిర్ పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి డాక్టర్ బసంత్ రెడ్డి హాజరై సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలోని ఉపాధ్యాయులను సన్మానించారు. అలాగే క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను డాక్టర్ బసంత్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, ఏవో నర్సారెడ్డి లు అభినందించారు.

ముద్ర రుణాలపై అవగాహన

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండల కేంద్రంలోని ఘన్‌పూర్ గ్రామ శివారులోని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ అర్ఎస్ఈటిఐలో మంగళవారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ముద్ర రుణాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్బిఐ అర్అర్‌టసిఎం క్రెడిట్ రవికుమార్, ఎల్‌డిఎం నిజామాబాద్ శ్రీనివాస రావు పాల్గొని మాట్లాడారు. ముద్ర రుణాలకు ఎవరు అర్హులు ? ఎంత వరకు రుణాలు తీసుకోవచ్చు.. తీసుకున్న రుణాలను ఎప్పుడు కట్టాలి.. తాము చేస్తున్న వ్యాపారంలో వృద్ధి ఎలా సాధించాలనే దానిపై వివరించారు. బ్యాంకు లో తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా చెల్లిస్తూ తమ కుటుంబాలను అన్నివిధాల తోడుగా ఉండే విధంగా చూడాలని సూచించారు. అంతకు ముందు ఎల్ డిఎం శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి ద్విచక్ర వాహనం శిక్షణను ప్రారంభించారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించు ఫ్యాకల్టీలు భాగ్యలక్ష్మి, ముస్తాక్, షకీల్, రఘుదీప్ ను సన్మానించారు. కార్యక్రమంలో అర్ఎస్ఈటిఐ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది రామకృష్ణ, ట్రైనర్లు పాల్గొన్నారు.

మూడోసారి నీట మునక

- వరదకు నీట మునిగిన సోయా, వరి
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- మత్తడులు దూకుతున్న చెరువులు
- కమ్మర్‌పల్లిలో 52.4 మి.మీ వర్షం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలో సోమవారం ఉదయం నుండి మంగళవారం ఉదయం వరకు కమ్మర్ పల్లి లో 52.4మీల్లి మీటర్ల భారీ వర్షం కురిసింది.సోమవారం రాత్రి నుండి శనివారం తెల్లరే జమున వరక ఏకదాటిగా భారీ వర్షం కురిసింది.భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు చేరింది.మండల కేంద్రం నుండి ఉప్లూర్ వెళ్లే దారిలో వరద కాలువ సమీపంలోని కల్వర్టు వద్ద బీటి రోడ్డు పైనుండి వరద నీరు పెద్ద ఎత్తున ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. కల్వర్టు వద్ద బీటి రోడ్డు మరింతగా కోతకు గురై ప్రమాదకరంగా మారింది.రాత్రివేళ ప్రయాణం చేసే వాహనదారులు కోతకు గురైన కల్వర్టును గమనించకుండా అటువైపుగా వెళ్ళితే ప్రమాదాలకు గురయ్యే అస్కారం ఉంది.కల్వర్టు కాలువకు ఇరువైపులా భారీ వరద నీరు మూలంగా కాల్వ గట్టు కోతకు గురై పంట పోలాల్లోకి వరద నీరు చేరి వరి పోలాలు, సోయా పంటలు నీట మునిగాయి.కల్వర్టుకు కుడి, ఎడమ వైపు సమీపంలోని సోయాబిన్, వరి పోలాలు నీట మునిగాయి. గత రెండు రోజులుగా పంటలు నీటిలోనే మునిగి ఉన్నాయి.పంటలు నీటిలోనే ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.భారీ వర్షాల మూలంగా పలు చోట్ల వరి పోలాల్లో ఇసుక, మట్టి మేటలు వేశాయి.దీంతో పెద్ద ఎత్తున సోయా, వరి, పసుపు పంటలకు నష్టం వాటిల్లే అస్కారం ఉండడంతో రైతులు లబోదిబోమంటున్నారు.అధిక వర్షం మూలంగా రోజుల తరబడి పంటలు నీటిలోనే ఉండడం వల్ల పంటలు కుళ్ళిపోవడంతో పాటు అధికంగా తెగుళ్ళు సోకేందుకు అస్కారం ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.కాగా భారీ వర్షాలతో చిన్న చిన్న కుంటలు,పంట కాలువల నుండి వరద నీరు పెద్ద ఎత్తున చెరువుల్లోకి చేరడంతో అన్ని చెరువులు మత్తడులు దూకుతున్నాయి.



పొలాల్లోకి చేరిన ఇసుక



రోడ్డుపైనుండి పారుతున్న వరద నీరు

ముచ్చటగా ముడోసారి నీట మునిగిన పంటలు

రెండు రోజుల క్రితం భారీ వర్షంతో వచ్చిన వరదలకు పంట పొలాలు దెబ్బతిన్నాయి. నెలరోజుల క్రితం, పదిహేను రోజుల క్రితం కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని మళ్ళీ సాగుకు అనుకులంగా మలుచుకున్నారు. తిరిగి రెండు రోజుల క్రితం మళ్ళీ కురిసిన భారీ వర్షంతో మరోసారి పంట పొలాల్లో ఇసుక, మట్టి మేటలు వేశాయి. గట్లు కోతకు గురవ్వడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు .ఈ వర్షాకాలంలోనే ఇప్పటికి మూడు సార్లు పంటలు నీట మునగడంతో ఈ సంవత్సరం ఖరీఫ్ పంట చేతికి వస్తోందో.. లేదో.. అని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.వర్షాలు కురవడంతో సంతోషంగానే ఉన్న అధిక వర్షంతో పంటల నీట మునగడమే ఇబ్బందిగా

గడప గడపకు జీవనన్న కార్యక్రమం



కేసీఆర్ పాలన గురించి వివరిస్తున్న మండల అధ్యక్షులు

నవతెలంగాణ-నందిపేట్

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ పార్టీ కోసం పని చేయాలని మండల అధ్యక్షుడు మచ్చర్ల సాగర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో 163వ బూత్‌లో పియుసి చైర్మన్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఆదేశాలు మేరకు గడపగడపకు కేసీఆర్ గడపగడపకు జీవన్ అన్న కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటింటికి వెళ్లి తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు పరిపాలన, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత కేసీఆర్ పరిపాలన విధానాన్ని ప్రజలకు వివరించారు. నియోజకవర్గంలో గత 60 ఏళ్లలో జరగని అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే జీవన్ రెడ్డి అని, వచ్చే ఎన్నికల్లో జీవన్ రెడ్డికి 60 వేల కోట్ల మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశామని తెలిపారు. కార్యక్రమంలో నందిపేట్ మండల భారత రాష్ట్ర సమితి పార్టీ అధ్యక్షులు మచ్చర్ల సాగర్, బూత్ నాయకులు నాగ శివ,ఉమ్మడ అశోక్, ఎద్దిగారి దినేష్, చుక్కబట్ల దీపక్, మచ్చర్ల సతీష్,నరేష్, మండల యూత్ నాయకులు దర్వాడి అశోక్, గంధం రాజశేఖర్, వార్డు మెంబర్లు గంధం పాల్గొన్నారు.

మొక్కలు నాటే కార్యక్రమం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. వేణుగోపాల స్వామి ఆలయం, పోచమ్మ దేవాలయం వద్ద గ్రామ అభివృద్ధి కమిటీ కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ సక్కారం అశోక్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఆకుల భాజన్న మాట్లాడుతూ నాటిన మొక్కల సంరక్షణకు తగిన ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. గ్రామంలో ప్రతి ప్రతి ఒక్కరు తమ వంతుగా మొక్కలు నాటి సంరక్షించే కార్యక్రమాన్ని చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఉపసర్పంచ్ విక్రమ్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు అల్లకొండ గంగాధర్, కార్యదర్శి గంగారాం, సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

దొంగ ఓట్లు ముద్రించే ముఠాపై చర్యలు తీసుకోవాలి



ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ ఉపాధ్యక్షులు నిరంజన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ వికాస్ రాజుని కలిసి జిల్లా నాయకులు ఫిర్యాదు చేశారు. మూడు రోజుల క్రితం నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో అధికార పార్టీకి చెందిన కొంతమంది దొంగ ఓట్లను ముద్రించే ముఠాను కాంగ్రెస్ నాయకులు పట్టుకొని తాసిల్దార్‌కి అప్పజెప్పారన్నారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన అధికారులు, అధికార పార్టీ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు నిరంజన్ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, పిసిసి ఉపాధ్యక్షులు తాహెర్ బిన్ హందాన్, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కేశ వేణు వినతి పత్రం అందజేశారు. దీనిపై ఎన్నికల కమిషనర్ వికాస్ రాజు స్పందిస్తూ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారన్నారు.

మా ఓట్లు మంత్రి ప్రశాంత్ రెడ్డికే

బషీరాబాద్ మాదిగ సంఘం సభ్యుల తీర్మానం



తీర్మానం చేసిన సంఘం సభ్యులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామానికి చెందిన మాదిగ సంఘం వంత సభ్యులు రాబోయే శాసనసభ ఎన్నికల్లో రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి, బిఆర్ఎస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ అభ్యర్థి వేముల ప్రశాంత్ రెడ్డికి మద్దతు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ మేరకు మంగళవారం సంఘ భవనంలో 44 కుటుంబాల సభ్యులతో సంఘ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో ఎవరికి మద్దతు ఇవ్వాలనే విషయమై చర్చించారు. మెజారిటీ సభ్యుల అభిప్రాయం మేరకు మంత్రి ప్రశాంత్ రెడ్డి కే మద్దతిస్తూ ఆయనకే ఓటు వేయాలని నిర్ణయించి తీర్మానం చేశారు.

సావిత్రిబాయి పూలేకు నివాళి

నవతెలంగాణ-ఆర్మూర్

భారతదేశంలో మొట్టమొదటి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలేను గుర్తించి ప్రతి మహిళ ఆదర్శంగా తీసుకొని ఉన్నత చదువులు చదివి, స్త్రీ విలువని చాటాలని కౌన్సిలర్ సాయికుమార్ తెలిపారు. పట్టణంలోని 29వ వార్డులో ఉపాధ్యాయుల దినోత్సవ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో పోషణ మాసం

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

ఎల్లమ్మ గుట్టలోని అంగన్‌వాడీలో మంగళవారం పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఆరు నెలలు నిండిన శిశువులకి ఎత్తులు బరువులు చూశారు. కూరగాయలు పండ్లతో కలిపి మిశ్రమంగా తయారు చేసే పద్ధతులను తల్లులకు నేర్పించి అలాగే అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తల్లులు పాల్గొన్నారు.

గౌరవవేతనం పెంపు పట్ల హర్షం

- సీఎం, మంత్రి, ఎమ్మెల్యేల చిత్రపటాలకు పాలాభిషేకం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/ఆర్మూర్/జక్రాన్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో మంగళవారం ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర రోడ్లు భవనాలు గృహ నిర్మాణ శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి చిత్రపటాలకు వివోఏలు పాలాభిషేకం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వివోఏల గౌరవ వేతనాన్ని రూ.8వేలకు పెంచడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్పంచ్ సక్కారం అశోక్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు వివోఏలు మాట్లాడుతూ... ఐకేపి లో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న తమ వేతనం రూ. 5వేల 900 నుంచి రూ.8 వేలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 442 ను జారీ చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కస్తూరి విక్రమ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సిసి భాగ్యలక్ష్మి, వివోలు రజిత, కృష్ణవేణి, లావణ్య, భాగ్యలక్ష్మి, మహిళా ప్రతినిధులు గంగామణి, మైస లక్ష్మి, శ్రీ లక్ష్మి, స్వప్న, సక్కారం చిన్నక్క, నల్ల లక్ష్మి, బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు బైకాని మహేష్, నాయకులు ఎన్. మోహన్, తోట అప్పయ్య, బందెల రాజు, ప్రశాంత్, ఎన్. రమేష్, అధ్యక్షులు బాజన్న, తదితరులు పాల్గొన్నారు.



జక్రాన్‌పల్లి :పాలాభిషేకం చేస్తున్న వీఓఏలు

ఆర్మూర్ :పట్టణంలోని మండల సమాఖ్య కార్యాలయంలో ఐకేపీ లో పనిచేస్తున్న వివోఏలకు (గ్రామ సంఘం సహాయకులు) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు పెంచినందున కెసిఆర్, ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. వివోఏల యూనియన్ అధ్యక్షురాలు సువర్ణ పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలో మహిళా సమాఖ్య ఆవరణలో ముఖ్యమంత్రి చిత్రపటానికి వివోఏలు పాలాభిషేకం చేశారు. వివో ఏలకు వేతనాలు 8 వేల రూపాయలు పెంచినందుకు మండలం పరిధిలోని వీవోఏల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వివోఏల ప్రతినిధులు ప్రవళిక, దివ్య , మాధవి, వీవోఏలు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

11 నుండి పారిశుద్ధ్య డ్రైవర్ల సమ్మెను జయప్రదం చేయండి

- తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కార్యదర్శి మల్యాల గోవర్ధన్ పిలుపు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఈనెల 11 నుండి చేపట్టనున్న పారిశుద్ధ్య డ్రైవర్ల సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కార్యదర్శి మల్యాల గోవర్ధన్ పిలుపునిచ్చారు. మంగళవారం తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు), నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పారిశుద్ధ్య డ్రైవర్ల యూనియన్ ఆధ్వర్యంలో నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సిసికి సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా మల్యాల గోవర్ధన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికులకు మేడే కానుకగా పెంచిన వెయ్యి రూపాయల వేతనాన్ని రెండు నెలలు చెల్లించి, తిరిగి రికవరీ చేయడానికి నిరసిస్తూ, పెంచిన వెయ్యి రూపాయలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 11 నుండి సమ్మెలోకి పారిశుద్ధ్య డ్రైవర్లు వెళ్తున్నారని తెలిపారు. పెంచిన వేతనాలను పారిశుద్ధ డ్రైవర్లకు ఇవ్వాలని నగర మేయర్ కి, కమిషనర్ కి విన్నవించినప్పటికీ సమస్య పరిష్కారం కానందున సమ్మెలోకి వెళ్తున్నామని అన్నారు. సమస్య పరిష్కారం చేసి సమ్మెను నివారించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ పారిశుధ్య డ్రైవర్ల యూనియన్ నాయకులు లక్ష్మణ్, వెంకటీష్, మహేష్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్యాల గోవర్ధన్

25మందికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు



ప్రశంసాపత్రాలతో ఉత్తమ ఉపాధ్యాయులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండలంలోని 25 మంది అధ్యాపకులకు మంగళవారం సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఉత్తమ అధ్యాపకుల అవార్డులను అందజేశారు. ఇందల్ వాయి మండలంలోని ఇందల్ వాయి గ్రామంలోని రైతు వేదికలో అవార్డుతో పాటు ప్రశంస పత్రం అందించి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల నోడల్ అధికారిని సంధ్య నాయక్, విశిష్ట అతిథిగా మన ఊరు మనబడి అధికారిని వీరలక్ష్మి పాల్గొన్నారు. కార్యక్రమంలో పిఆర్టియు మండల ప్రధాన కార్యదర్శి భార్గవ్, బీసీటీయు మండల అధ్యక్షులు గంగ మోహన్, తపాస్ మండల అధ్యక్షులు గంగ ప్రసాద్, యూటీఎఫ్ మండల అధ్యక్షులు పవన్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

15న చలో హైదరాబాద్

బీడీ కార్మికుల ఆకలికేక మహాధర్నాను జయప్రదం చేయండి

బీఎల్‌టీయూ

నవతెలంగాణ-కంఠేశ్వర్

సెప్టెంబర్ 15న చలో హైదరాబాద్ బీడీ కార్మికుల ఆకలి కేక మహాధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ బహుజన కార్మిక సంఘం బిఎల్‌టీయూ పిలుపునిచ్చింది. మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీఎల్‌టీయూ రాష్ట్ర కార్యాలయం లో రాష్ట్ర అధ్యక్షులు యస్, సిద్ధిరాములు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గడిచిన రెండు అసెంబ్లీ ఎన్నికలలో బీడీ పరిశ్రమలో పనిచేసేవారికీ 2016,రూ.ల జీవన భృతి ఇస్తామని వాగ్దానం చేశారని అన్నారు. ఇప్పటికీ వాగ్దానం అమలు చేయలేదని తెలిపారు. 2010లో బీడీ కార్మిక సంఘం సమ్మె పోరాటం ద్వారా అనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 41జిఓ ఇచ్చిందన్నారు. ఈ 41,జిఓ అమలు చేయకుండా,81,జిఓ తేవడం ద్వారా బీడీ కార్మికులకు తీరాని అన్యాయం జరిగిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే 41జిఓ ప్రకారం బీడీ కార్మికులకు వేతనాలు ఇప్పి ఇస్తామని చెప్పిన ఇవ్వలేదన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బీడీ పరిశ్రమ పై ఆంక్షలు, కోప్టా చట్టంతేవడం, జీఎస్టీ వేయడంద్వారా బీడీ పరిశ్రమ కార్మికులకు నెలలో 10,రోజు లు కూడా పనిలేదని అన్నారు. సమస్యల పరిష్కారంకోసం ఈనెల 15న ఛలో హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద బీడీ కార్మికుల అకలి కేక మహా ధర్నాలో బీడీ కంపెనీల్లో పనిచేసేవారందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం నిజామాబాద్ జిల్లా నాయకులు, ప్రకాష్, మల్లేష్, నాగమణి, స్వరూప, జయలక్ష్మి, లావణ్య, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిద్ధిరాములు

పలు కుటుంబాల పరామర్శ

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంతో పాటు రెంజర్ల గ్రామంలో పలు బాధిత కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి పరామర్శించారు. ముప్కాల్ మండల కేంద్రంలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన కొమ్ముల సత్యం కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. ముస్కు ముత్తెన్న గత కొన్నిరోజుల కిందట గుండె ఆపరేషన్ జరగడంతో విషయం తెలుసుకున్న సునీల్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రెంజర్ల గ్రామానికి చెందిన ధర్పల్లి నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యం రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం చిన్నారెడ్డి, బీసి సెల్ అద్యక్షులు ఆకుల రమేష్, మండల వైస్ ప్రెసిడెంట్ ఆకుల రాజేశ్వర్, యూత్ అధ్యక్షులు పోల ప్రవీణ్, లోక సుభాష్ రెడ్డి, గ్రామ అధ్యక్షులు కొత్తపల్లి రాజన్న, ప్రశాంత్, మాజీ ఎంపీటీసీ గంగాధర్ ఉన్నారు

'మానవత్వానికి నిలువెత్తు రూపాలు'

నవతెలంగాణ-నిజామాబాద్

మానవత్వానికి నిలువెత్తు రూపాలు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, మదర్ థెరిస్సా అని సత్యశోధక్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ రావుట్ల నర్సయ్య అన్నారు. మంగళవారం సిరికొండలోని సత్యశోధక్ పాఠశాలలో భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న, ఉత్తమ ఉపాధ్యాయులు సర్వేపల్లి రాధాకృష్ణన్, విశ్వమాత, నోబెల్ శాంతి, భారతరత్న గ్రహీత, మదర్ థెరిస్సా ల వర్ధంతిలను ఘనంగా నిర్వహించారు. ముందుగా వారి చిత్రపటాలకు పూలమాలనాలంకరించి నివాళులర్పించారు. మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని నేటి యువతరం దేశానికి, ఉత్తమ సమాజ నిర్మాణానికి కృషి చేయడంతో పాటు దయార్ధ హృదయాన్ని అలవర్చుకుని తోటి మనుషుల వికాసానికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నదానానికి బియ్యం వితరణ

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని అంకాపూర్ గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా మంగళవారం బిజెపి నాయకులు పైడి రాకేష్ రెడ్డి నివాసంలో మాక్లూర్ మండలంలోనీ వివిధ గ్రామాల్లో చేయు అన్నదానానికి బియ్యం ఇతర వంటసామగ్రి నీ గ్రామస్తులకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కృష్ణుడు గొప్ప యుద్ధ నీతి వంతుడు అని అధర్మం పై ధర్మం విజయం సాధిస్తుందని అన్నారు. అలాగే ఎమ్మెల్యేపై కూడా రాకేష్ రెడ్డి విజయం సాధించడం ఖాయం అని అన్నారు. కార్యక్రమంలో మక్లూర్ మండల అధ్యక్షుడు సురేష్ నాయక్ ,జిల్లా నాయకులు గంగోని సంతోష్ , శ్రీనాథ్ సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

వాహనాల బహిరంగ వేలం వాయిదా

నవతెలంగాణ-కంఠేశ్వర్

వర్షాలకారణంగా వాహనాల బహిరంగ వేలం వాయిదావేసినట్టు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆచూకీ లేని వదిలివేసిన మోటార్ సైకిళ్ళు, ఆటోలు మొత్తం (226) వాహనాలను నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ఈనెల 6న నిర్వహించాల్సి ఉండగా భారీ వర్షాల కారణంగా నిర్వహించడం లేదని పేర్కొన్నారు. ఈ వేలం మళ్ళీ నిర్వహిస్తామని అప్పుడు పత్రిక ప్రకటన ద్వారా తెలియజేయడం జరుగుతుందని తెలిపారు.

బీసీ, ఎస్టీ బాలికల వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలి : పీడీఎస్‌యూ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ కేంద్రంలో బీసీ, ఎస్టీ బాలికల వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు ఎం నరేందర్ అన్నారు.ప్రగతిశీల ప్రజాస్వామ్యం విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో బుధవారం పట్టణ కేంద్రంలోని బీసీ బాలికల వసతిగృహం ఎస్టీ బాలికల కళాశాల వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ కేంద్రంలోని శిథిలావస్థలో ఉన్న బీసీ బాలికల హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని అధికారులకు విన్నవించుకుంటే స్పందన లేదని అన్నారు. ఎస్టీ బాలికల వసతి గృహం లేకపోవడం ద్వారా విద్యార్థినిలు చదువులకు దూరం అవుతున్నానని వారు తెలిపారు కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్ దుర్గాప్రసాద్ , ఏరియా నాయకులు వినోద్, సాయి, కృష్ణ, రాజు, వేణు, సాయికుమార్ పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్‌ను సందర్శించిన కలెక్టర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా కేంద్రంలోని వినాయకనగర్ లో గల ఈవీఎం గోడౌన్ ను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మంగళవారం సందర్శించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్ లు, ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను పరిశీలించారు. పోలీసు భద్రత, అగ్నిమాపక సిబ్బంది విధులు నిర్వహిస్తున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
బుధవారం | సెప్టెంబర్ 06, 2023 | www.navatelangana.com

చదువులో ప్రతిభ కనబరిచిన బాలికలకు ఆర్థిక చేయూత

నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8, 9, 10వ తరగతిలో చదువులో ప్రతిభ కనబరిచిన బాలికలకు ఎడపల్లి కెనరా బ్యాంక్ మేనేజర్ సుశీల్ కుమార్ ఆధ్వర్యంలో బాలికలకు ఒక్కొక్కరికి రూ.5వేల నగదును అందజేశారు. తరగతుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి తరగతిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు ఎడపల్లి కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో ఉపకార వేతనాలను అందజేశారు. ఎడపల్లి మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో గత సంవత్సరంలో 8, 9, 10 తరగతుల్లో ఉత్తమ విద్యార్థులు రంజిత, నిశాంత్, నిశితకు బ్యాంక్ మేనేజర్ సునీల్ కుమార్ కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి రూ.5000ల చొప్పున ఉపకార వేతనాలను అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ సునీల్ కుమార్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులను ప్రోత్సహించడానికి కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో స్కాలర్షిప్‌లను పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ సిబ్బంది, పాఠశాల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిలు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ కోదండరామ్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలో టీజేఎస్ కార్యాలయంలో ప్రొఫెసర్ కోదండరామ్ జన్మదిన వేడుకలకు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ జన సమితి పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇంచార్జ్ నిజ్జన రమేష్ కేక్ కట్ చేశారు. మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిజ్జన రమేష్ మాట్లాడుతూ.. ప్రొఫెసర్ కోదండరామ్ విద్యార్థి ఉద్యమంలో పాల్గొన్నారని, రైతుల పక్షాన పోరాటం చేశారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం కోసం సకల జనులను ఏకం చేసి తెలంగాణ రాష్ట్రం సాధించడంలో ముందున్నారని వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కేసీఆర్ ప్రభుత్వం రూపొందిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటం చేస్తున్నాడన్నారు. ప్రజలు ప్రొఫెసర్ కోదండరామ్ నాయకత్వాన్ని బలపరచాలని నిజ్జన రమేష్‌ను కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కుంబాల లక్ష్మణ్ యాదవ్, ఉపాధ్యక్షులు పూల్‌సింగ్ నాయక్, మండలాధ్యక్షులు బట్టు లక్ష్మణ్ ముదిరాజ్, విద్యార్థి నాయకులు విజయ్ కుమార్, గోపి నాయక్, రతన్ నాయక్ పాల్గొన్నారు.

వైద్యం అందుబాటులో ఉండాలి

- **ఎమ్మెల్యే జాజాల సురేందర్**

నవతెలంగాణ-రామారెడ్డి/గాంధారి

భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పారిశుధ్యం, వైద్యం ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీపీ దశరథ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించగా, సమావేశానికి సురేందర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని రంగ చెరువు అలుగు తెగి నీరు వృథాగా పోతుందని, రైతులకు ఇబ్బందిగా ఉందని సభా దృష్టికి తీసుకొచ్చారు. విద్యుత్, నీటిపారుదల శాఖల సమస్యలపై పలువురు ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు శాఖల అధికారులు నివేదికను చదివి వినిపించారు. మండల సర్వసభ్య సమావేశానికి పలు శాఖల అధికారులు గైర్హాజరుపై ఎమ్మెల్యే సురేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నారెడ్డి మోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రవీందర్‌రావు, రైతుబంధు అధ్యక్షులు గురిజాల నారాయణరెడ్డి, ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎమ్మార్వో రోజా, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.


రామారెడ్డి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్


గాంధారి : ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనది..

గాంధారి : ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని ఎమ్మెల్యే సురేందర్ అన్నారు. మండల కేంద్రంలోని హరలే గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన గురుపూజోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. మండలంలోని వివిధ గ్రామాల్లో మారుమూల ప్రాంతాల్లో పేద విద్యార్థులకు విద్యను బోధిస్తున్న ప్రతి ఉపాధ్యాయుడికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. గ్రామాల్లోకి వెళ్లలేని పరిస్థితిలో ఉన్న అనునిత్యం అష్టకష్టాలు పడుతూ ఉపాధ్యాయులు పేద మధ్యతరగతి విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నారని, సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉన్నతమైనదని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ ఉపాధ్యాయులను గౌరవించాలని, ఉపాధ్యాయులు చూపిన మార్గంలో నడుస్తూ విద్యార్థులు ఉన్నత శిఖరాల అవరోధించాలని ఆయన అన్నారు. మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయుని ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు శంకర్ నాయక్, పీఏసీఎస్ చైర్మన్ సాయికుమార్, గాంధారి సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యం, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శివాజీరావు, బీఆర్ఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు జింగురు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో పనిచేస్తున్న
కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

- **సీఐటీయూ డిమాండ్**
- **పులాంగ్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన, వినతి**


అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన చేపడుతున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో పులాంగ్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలోని యుపీహెచ్చీ, యుని హెచ్సీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ పారామెడికల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. చాలా రోజులుగా ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తున్నా పట్టించుకోవడంలేదని అన్నారు. ఎనోచ్ఎంలో సుమారు 17 వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారని, వీరిలో అత్యధికులకు రాష్ట్ర ప్రభుత్వం పిఆర్సి ప్రకారం జీతభత్యాలు చెల్లించడం లేదని అన్నారు. గతంలో జీఓ నెం.510 ద్వారా సుమారు 10 వేల మంది వరకు డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మాసిస్టులు, ఏఎన్ఎం తదితరులకు బేసిక్ ప్రకారం వేతనాలు నిర్ణయించి చెల్లించారని, ఇందులో కొన్ని కేటగిరీలకు పర్మినెంట్ ఎంప్లాయి బేసిక్ కన్నా తక్కువ చెల్లిస్తున్నారని తెలిపారు. వీరందరికీ వారి కేడర్ ప్రకారం వైద్య, ఆరోగ్య శాఖలోని పర్మినెంట్ ఉద్యోగుల యొక్క బేసిక్, అలవెన్సులు నిర్ణయించాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు షాదుల్లా, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు మురళీ, రమేష్, రవి గౌడ్, గంగాధర్, వెంకటేష్, లక్ష్మణ్, వందన, నవత, సంతోష్ ఆనంద్ శ్యామ్ సత్యనారాయణ హుస్సేన్ మానస, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరం

- **ఐసీడీఎస్ ఎడపల్లి మండల పర్యవేక్షకురాలు వినోద**

నవతెలంగాణ-ఎడపల్లి/వర్ని


ఎడపల్లిలో..

గర్భిణీలు, బాలింతలు పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఐసిడిఎస్ బోధన్ ప్రాజెక్ట్ ఎడపల్లి మండల పర్యవేక్షకురాలు వినోద అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి మండలంలోని అన్ని అంగన్వాడి కేంద్రాలలో పోషణ మాసోత్సవం, సరైన పోషణ ఆరోగ్యం పట్ల గర్భిణీ మహిళలకు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మహిళల పట్ల అంగన్వాడి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆమె అంగన్వాడి ఉపాధ్యాయులకు, ఆశావర్కర్లకు సూచించారు. మండలంలోని మంగళపాడ్ గ్రామపంచాయతీలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసం, సరైన పోషణ ఆరోగ్యం పట్ల అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ బట్టు హనుమాన్లు అధ్యక్షత వహించగా, మండల పర్యవేక్షకురాలు వినోద ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈనెల 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు షెడ్యూల్ ప్రకారంగా కార్యక్రమాలను నిర్వహించాలని ఆమె అన్నారు. బాలింతలు, గర్భిణులు, పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని బలవర్ధకమైన పౌష్టికాహారం అందించాలని అంగన్వాడీ ఉపాధ్యాయులకు సూచించారు. తల్లిపాల ఆవశ్యకత, కిశోర బాలికలలో రక్తహీనతపై అవగాహన కార్యక్రమాలను, మహిళలకు వివరించారు. సమతుల ఆహారాన్ని, పాలు, గుడ్లు చిరుధాన్యాల ఆవశ్యకతను సూపర్వైజర్ వినోద వివరించారు. బాలామృతం చిన్నారి పిల్లలకు కాకుండా గర్భిణి మహిళలకు బలమైన మంచి పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. అంగన్వాడీ కేంద్రం ఆదివారంలో నిర్వహించే కార్యక్రమాలకు స్థానిక ప్రజాప్రతినిధులను తప్పకుండా ఆహ్వానించాలని ఆమె అంగన్వాడీ ఉపాధ్యాయులను వైద్య ఆరోగ్య సిబ్బందిని కోరారు. పిల్లల ఎత్తు, బరువును పరీక్షించి తీవ్ర పోషణ లోపం ఉన్న పిల్లల (సాం)వయసుకు తగ్గ ఎత్తు బరువు లోపం (మామ్) చిన్నపిల్లలను గుర్తించి గుడ్లు, బాలామృతం తీసుకునేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తప్పక పట్టించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బట్టు హనుమాన్లు, ఎంపీటీసీ సభ్యురాలు వనజ నాగరాజు, ఎడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజ్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పీ స్వప్న, ఏఎన్ఎం శాంత, అంగన్వాడీ ఉపాధ్యాయులు బండ కళ్యాణి, అనురాధ, ఆశావర్కర్లు విజయ, కుంట అనిత, ఐకేపీ గ్రామ వీవోఏలు కుమ్మరి పుష్ప, జంగం సంధ్య తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు పోషకాహారంపై అవగాహన సదస్సు

వర్ని(చందూర్) : పోషణ మాసంలో భాగంగా చందూర్ మండలంలోని కారేగాం తండా అంగన్వాడీ కేంద్రంలో పోషకాహారంపై తల్లులకు అవగాహన కల్పించారు. 0 నుంచి 6 నెలలు కేవలం తల్లిపాలు పిల్లలకు తాగించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత సూచించారు. ఇతర పానీయాలు ఇవ్వకూడదని, ఆరు నెలలు నిండిన తరువాత తల్లిపాలతో పాటు అనుబంధ పోషకాహారం మొదలు పెట్టాలని ఆమె తెలిపారు. పిల్లల పోషణ స్థితి గురించి తల్లిదండ్రులకు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఎల్‌వోసీ అందజేత

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలంలోని సాలూర క్యాంపు గ్రామానికి చెందిన చంద్రలేఖ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలుసుకొన్న బోధన్ ఎమ్మెల్యే షకీల్ అమెర్ ఆమె వైద్యం కోసం రూ.2,00,000 ఎల్‌వోసీని మంగళవారం ఆమె కుటుంబ సభ్యులకు అందించారు.

బాలిక అదృశం

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (17) ఆగస్టు 30 వ తేదీన బోధన్ పట్టణంలోని ఓ కళాశాలకు వెళుతున్నట్టు ఇంట్లో చెప్పి బోధన్‌కు వెళ్లింది. ఇంటికి తిరిగి రాలేదు. దీంతో బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోచారం ప్రాజెక్టుకు పోటెత్తిన వరద

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్ (లింగంపేట్)

కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్టుకు సోమవారం సాయంత్రం నుండి వరద పోటెత్తింది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రాజెక్టు లోనికి భారీగా వరద నీరు చేరి ప్రాజెక్ట్ మరోసారి పొంగిపొర్లుతోంది. పోచారం ప్రాజెక్టు ప్రస్తుత వర్షాకాలంలో గత జూలై నెల 21వ తేదీన మొదటిసారి పొంగిపొర్లగా, ప్రస్తుతం ఆదివారం రాత్రి నుండి కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టుకు భారీగా వరదలు పోటెత్తాయి. ఎగువ ప్రాంతాలు లింగంపేట్ పెద్ద వాగు, గుండారం కొండాపూర్ బూరుగుపల్లి తదితర ప్రాంతాల నుండి పోచారం ప్రాజెక్టులోకి వరద నీరు చేరుతుంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 1464.00 అడుగులు, 1. 820 టీ ఎంసిలు కాగా సోమవారం ఉదయం ప్రాజెక్టులోకి 5 వేల 207 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరగా, భారీగా వరదలు రావడంతో సోమవారం సాయంత్రానికి ప్రాజెక్టులోనికి 27 వేల 58 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నట్లు, అంతే మేరకు ప్రాజెక్టు పై నుండి పొంగిపరులతో మంజీరా నదిలో కలుస్తున్నట్లు ఎల్లారెడ్డి నీటిపారుదల శాఖ డి ఈ వెంకటేశ్వర్లు తెలిపారు.

తెలంగాణలోని 40 బీసీ కులాలకు
ఓబీసీ జాబితాలో చేర్చండి

- **జాతీయ బీసీ కమిషన్‌ను కోరిన ఎంపీ బీబీ పాటిల్**

నవతెలంగాణ-లింగంపేట్/నవీపేట్

తెలంగాణలోని 40 బీసీ కులాలకు ఓబీసీ జాబితాలో చేర్చాలని జాతీయ బీసీ కమిషన్‌ను ఎంపీ బీబీ పాటిల్ కోరారు. ఢిల్లీలోని మహారాష్ట్ర సదన్‌లో జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారాం అహీర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన బహిరంగ విచారణకు తెలంగాణ ప్రభుత్వం తరపున ఎంపీ బీబీ పాటిల్, రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు శుభ ప్రద్ పటేల్‌తో పాటు అధికారులు హాజరయ్యారు. ఈ విచారణలో తెలంగాణలోని వీరశైవ లింగాయత్‌తో పాటు 40 కులాలను ఓబీసీ జాబితాలో చేర్చాలని జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారాం అహీర్‌ను జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు బీబీ పాటిల్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీబీ పాటిల్ మాట్లాడుతూ.. 40 కులాలు ఓబీసీ జాబితాలో లేకపోవటం వలన ఆ సామాజిక వర్గాలకు చెందిన బీసీలు.. కేంద్రంలో విద్య, ఉద్యోగ పరంగా రిజర్వేషన్ల ఫలాలు కోల్పోతున్నారని, ఆధారాలతో సహా జాతీయ బీసీ కమిషన్‌కు నివేదిక సమర్పించారు. ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా బీసీ కులాలను ఓబీసీ జాబితాలో చేర్చడంలో ముందడుగు పడటం లేదని గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర బీసీ కమిషన్ వెనుకబడిన కులాలపై లోతుగా అధ్యయనం చేసి వారి స్థితిగతులను తెలుసుకొని ఇప్పటికే పలుమార్లు నివేదిక ఇచ్చామని తెలిపారు. ఈ విషయంపై జాతీయ బీసీ కమిషన్ సానుకూలంగా స్పందించి.. తెలంగాణలోని 40 కులాలను న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తకుండా ఓబీసీ జాబితాలో చేర్చేలా కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని ఎన్సీబీసీ చైర్మన్ హన్స్ రాజ్ గంగారాం అహీర్ తెలిపారు.


నవీపేట్ : ప్రజాభిప్రాయ సేకరణలో ప్రతినిధులు

జాతీయ బీసీ కమిషన్ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ

నవీపేట్: జాతీయ బీసీ కమిషన్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని మహారాష్ట్ర సదన్‌లో తెలంగాణ ప్రభుత్వం సిఫారసు చేసిన 40 బీసీ కులాలపై జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హంస రాజు గంగారం అహీర్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా 17 కొత్త కులాల ప్రతినిధులతో పాటు 23 పాత కులాల ప్రతినిధులు హాజరయ్యారు.

బిజెపి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ లక్ష్మణ్, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య పార్లమెంట్ సభ్యులు బీబీ పాటిల్, బీసీ కమిషన్ సభ్యులు శుభప్రద పటేల్ హాజరయ్యారు. బిసి కులాల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు మోహన్ చవాన్, జాదవ్ శరత్, రాంప్రసాద్, గంగా ప్రసాద్, ప్రవీణ్, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ వాళ్లకే బీసీబంధు

- **జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి**

నవతెలంగాణ-రామారెడ్డి

వెనుకబడిన తరగతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టిన బీసీ బంధు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల, నాయకుల ఇష్టారాజ్యంగా మారి, నిజమైన లబ్ధిదారులకు అందకుండా, వారికి అనుకూలంగా ఉన్నవారికి, లక్షాధికారులకు మాత్రమే బీసీబంధు ఇస్తున్నారని, దీనిని ప్రజలు గమనిస్తున్నారని, బీఆర్ఎస్ పార్టీని తెలంగాణలో బంద్ చేసి తగిన గుణపాఠం చెప్తారని జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. గత నెల రోజుల నుంచి మండల కేంద్రంలోని రంగ చెరువు అలుగు తెగి, నీరు వృథా పోతుందని, పంట పొలాల్లో నీరు చేరి రైతులు ఇబ్బంది పడుతున్నారని, జిల్లా పరిషత్‌లో వంటావార్పు చేసి నిరసన తెలిపితే, తూతూ మంత్రంగా జేసీబీతో రోడ్డును శుభ్రం చేసి వెళ్లిపోయారని అన్నారు. మాట్లాడితే, రైతుల పార్టీ అని చెప్పుకునే స్థానిక ప్రజాప్రతినిధులు నిన్న మొన్న జరిగినట్లు మాట్లాడడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని, వారికి రైతులే తగిన గుణపాఠం చెప్తారని అన్నారు. బీసీబంధును గ్రామస్థాయి నుంచి సమాచారం తీసుకుని నిజమైన పేదల నుంచి ప్రతి ఒక్కరికి బీసీబంధు అందించాలని, బీఆర్ఎస్ పార్టీ వారికే బీసీబంధు ఇస్తామని అనడం సరైనది కాదని సొసైటీ వైస్ చైర్మన్ అమ్ముల పశుపతి అన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. పోసానిపేటలో 70 మంది దరఖాస్తు చేసుకుంటే నలుగురు లబ్ధిదారులకు అందించడం దారుణమని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వఢ్ల లక్ష్మీరాజం, అంబాయి ప్రసాద్, బీపేట నర్సింలు, నామాల రవి, జగన్, పోసానిపేట నర్సింలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నారెడ్డి మోహన్‌రెడ్డి

ఇసుక ట్రాక్టర్లు పట్టుకున్న పోలీసులు

- **వదిలేసిన రెవెన్యూ అధికారులు**

నవతెలంగాణ-బిచ్కుంద



బిచ్కు ంద మండలంలోని మంజీరా పరివాహక ప్రాంతం నుండి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను ఆదివారం ఎస్సై మురళి పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆదివారం కావడంతో పోలీస్ స్టేషన్లో ఉంచిన ట్రాక్టర్లను సోమవారం తదుపరి చర్యల నిమిత్తం రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. వాల్టా చట్టం ప్రకారం పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లపై పెనాల్టీలు విధించే విధంగా మైన్స్ అధికారులకు సమాచారం అందించాలి. ఇసుక ట్రాక్టర్ల విషయం ఆర్డీవోకు సమాచారం అందించి మొదటి దఫగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ దొరికితే తహసీల్దార్ తక్కువ తక్కువగా రూ.5వేలు, ఆపైన డబ్బులు జరిమానా విధించి చాలన్ రూపేనా ప్రభుత్వ ఖజానాకు జమ చేసి చలాన్ నెంబరు, తేదీ, ట్రాక్టర్ యజమాని పేరు, ఆర్సీ, డ్రైవర్ పేరు, లైసెన్స్ తదితర వివరాలు రిలీజింగ్ ఆర్డర్‌లో పొందుపరిచి రిలీజ్ చేయాల్సి ఉండగా పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లకు ఎలాంటి జరిమానా విధించకుండానే రెవెన్యూ అధికారులు ట్రాక్టర్లను వదిలివేసినట్లు సమాచారం. ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా చేస్తున్న ఇసుక మాఫియాకు రెవెన్యూ అధికారుల అండదండలు ఏమేరకున్నాయో విడిచిపెట్టిన ట్రాక్టర్ల విషయంలో తెలిసిపోతున్నది. బిచ్కుంద తహసీల్దార్ లక్ష్మణ్‌కు ట్రాక్టర్లపైన ఎంతవరకు డబ్బులు రూపేనా జరిమానా వేశారని వివరణ ఫోన్‌లో అడగగా ట్రాక్టర్ యజమానులతో చాలన్ కట్టిపించామని ఎన్ని రూపాయల చాలన్ కట్టిపించారో పదే పదే అడిగినా కట్టిన డబ్బుల వివరాలు తెలుపకపోవడం గమనార్హం. ఈ విషయంపై బాన్సువాడ ఆర్డీఓ భుజంగరావును ఫోన్‌లో వివరణ కోరగా ట్రాక్టర్లు పట్టుకున్న విషయం తన దృష్టికి రాలేదని, పట్టుకున్న ట్రాక్టర్లకు ఎంత జరిమానా విధించారో చాలన్ రూపేనా ప్రభుత్వ ఖజానాకు జమ చేసిన విషయం తన దృష్టికి రాలేదని పూర్తి వివరాలు తెలుసుకుంటారని వివరణ ఇచ్చారు.

మెడికల్ కాలేజీ పనులు పూర్తి చేయాలి

- **ఈ నెలలో తరగతులు ప్రారంభం**
- **వంద మంది ఉండేలా వసతి : పనులు పరిశీలించిన కలెక్టర్**

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)

ఈ నెల 15 నాటికి వైద్య కళాశాలలో పురోగతిలో ఉన్న పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ రాష్ట్ర తెలంగాణ వైద్య సేవ మౌళిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం వైద్యకళాశాలలో నాలుగు బ్లాకులలో పురోగతిలో ఉన్న పనులను పరిశీలించి పరిపాలన విభాగం, అనాటమీ, లెక్చర్ గ్యాలరిలో మిగిలిపోయిన ఫ్లోరింగ్, కార్పెంటరీ పనులను, సి.సి. రోడ్డు నిర్మాణ పనులను, ఇతర చిన్న చిన్న పనులను పూర్తి చేయాలన్నారు. ఫర్నీచర్, సౌండ్ సిస్టం, ప్రొజెక్టర్, ఇంటర్నెట్ వంటి అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ విద్యా సంవత్సరంలో మొదటి సంవత్సరం తరగతులు ఈ నెలలోనే ప్రారంభించుటకు అడ్మిషన్లు ప్రారంభమ య్యాయని అన్నారు. ఇందులో చదివే వంద మంది వైద్య విద్యార్థిని, విద్యార్థులకు కల్పిస్తున్న వసతి సౌకర్యాలను పరిశీలించి చెక్ లిస్ట్ ప్రకారం వైద్య కళాశాల, వసతి గృహాలకు కావలసిన అన్ని మౌళిక సౌకర్యాలు కల్పించాలన్నారు. నీటి ఇబ్బంది తలెత్తకుండా చూడాలన్నారు. ఫైర్ సేఫ్టీ, భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆహ్లాదకార వాతావరణానికి చక్కటి పచ్చిక బయళ్లు ఏర్పాటు చేయాలన్నారు. అంతకుముందు 250 పడకల స్థాయికి పెంచుతూ జిల్లా ఆసుపత్రిపై భాగాన నిర్మించిన నూతన భవనంలో మౌలిక సదుపాయాలను పరిశీలించారు. పెంచిన పడకల స్థాయికి అనుగుణంగా వెంటనే బెడ్స్ తెప్పించాలని జిల్లా మెడికల్ సూపరింటెండెంట్ విజయలక్ష్మికి సూచించారు. ఆసుపత్రిలోని ఐసీయూ, బాలింతల గదులను పరిశీలించి నీరు లీకేజీ కాకుండా మరమత్తులు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా రోగులను, బాలింతలను పరమార్శిస్తు డాక్టర్లు సమయానికి వచ్చి చెక్ చేస్తున్నారా, మందులు సరిగ్గా వేసుకుంటున్నారా, అల్పారం ఇచ్చారా అని ఆరా తీశారు. ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఇట్టి సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. వెంకటేశ్వర్, ఈఈ చంద్రశేఖర్, డిప్యూటీ ఈ ఈ సుధాకర్, ఏఈ అరవింద్, గుత్తేదారు, తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజూ ముంచెత్తింది

నవతెలంగాణ-రామారెడ్డి/సదాశివనగర్

మండలంలో ఆదివారం నుంచి కురుస్తున్న వర్షాలతో పాటు మంగళవారం కురిసిన వర్షాలకు, వాగులు వంకలు పొంగిపొరడంతో చెరువుల్లోకి భారీగా నీరు చేరడంతో అలుగులు ప్రమాదకర స్థాయిలో పారుతున్నాయి. రామారెడ్డి గంగమ్మ వాగు, కన్నాపూర్ వాగు తీవ్రస్థాయిలో ప్రవహించాయి. గన్‌పూర్ నుండి రెడ్డిపేట వచ్చే రోడ్డు వరద నీటితో పాక్షికంగా ధ్వంసం అయింది. సాయంత్రానికి వర్షం తగ్గడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వాతావరణ శాఖ మరో రెండు రోజులు వర్షాలు కురియను ఉన్నాయని హెచ్చరికలతో, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రజలకు సూచించారు.




రామారెడ్డి : ప్రమాదస్థాయిలో ప్రవహిస్తున్న కన్నాపూర్ వాగు.. సదాశివనగర్ : తెగిపోయిన బ్రిడ్జి పరిశీలన..

వర్షానికి తెగిన బ్రిడ్జి

సదాశివనగర్ : సదాశివనగర్ మండలం ఉమ్మడి యాచారం గ్రామపంచాయతీలోని లక్ష్మీనాయక్ తండాల్లోని ప్రాథమిక పాఠశాలకు వెళ్లే రహదారిలో భారీ వర్షానికి వాగుపై ఉన్న బ్రిడ్జి తెగిపోయింది. మంగళవారం నియోజకవర్గ గిరిజన నాయకులు శ్రీనివాస్ నాయక్ స్థానిక సర్పంచ్ మోహన్‌సింగ్, లత పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అకాలవర్షంతో తెగిపోయిన బ్రిడ్జి నిర్మాణం త్వరలోనే ఎమ్మెల్యే సహకారంతో నిర్మిస్తామని అన్నారు. కార్యక్రమంలో మండల మాజీ రైతుబంధు అధ్యక్షుడు శంకర్ నాయక్, మంగ్యానాయక్, లాల్ సింగ్, మోహన్ సింగ్, బాబు తదితరులు ఉన్నారు.